RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక TELANGANA PATRIKA TELUGU DAILY నిజం మా విజన్ 18వ వసంతంలోకి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:79 SATURDAY,AUGUST 29,2026 PAGES:12 COST: 2 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :79 శనివారం, ఆగష్టు 29, 2026, పేజీలు -12 వెల :2/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI



## రేవంతన్నా నీకు బంగారమంత ప్రేముంది

తెలంగాణ పత్రిక ప్రతినిధి: తెలంగాణలో నెలకొన్న రాజకీయ పరిణామాలు, పార్టీ వర్గాల చర్చల మధ్య మంత్రి కొండా సురేఖ సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సీఎంకు ఆమె రాఖీ కట్టారు. పార్టీలో వివాదాలు, పీసీసీ నోటీసుల అంశం తర్వాత ఇద్దరు నేతలు మొదటిసారి భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతీ ఏడాదలాగే ఈసారి కూడా సీఎం మిగతా2లో

## రాష్ట్రంలో 15,982 అంగన్‌వాడీ ఉద్యోగాలు

- సెప్టెంబర్ నాటికి నియామకాలు పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశం
- ఇంటర్ పాసైన వారు అర్హులు, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక
- ఎంపికలో ఇంటర్ మార్కులకు 70 శాతం వెయిటేజీ
- రెండు జోన్ల పరిధిలో టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీ



తెలంగాణ పత్రిక ప్రతినిధి: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 15,982 పోస్టులను సెప్టెంబరు నెలాఖరులోగా భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మొత్తంగా 3,100 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 12,882 హెల్పర్ పోస్టులు కలిపి 15,982 ఖాళీలను భర్తీ మిగతా2లో

## హైదరాబాద్‌లో భూమి ధరల కొత్త రికార్డు..

**ఎకరం రూ.269 కోట్లు!**

- హైదరాబాద్ రాయదుర్గంలో మరోసారి భూముల రికార్డు ధర
- ఎకరం రూ. 269 కోట్లకు పలికిన ప్రభుత్వ భూమి
- భూమిని దక్కించుకున్న వంశీరాం బిల్డర్స్
- ఈ వేలంతో ప్రభుత్వానికి రూ. 1,447 కోట్ల ఆదాయం



## హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది

## శుక్రవారం నుంచి ప్లాట్లు

తెలంగాణ పత్రిక ప్రతినిధి: చూద్దాంహైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్‌లో ప్లాట్ల కేటాయింపునకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం లక్కీ డ్రా ద్వారా లబ్దిదారులను ఎంపిక చేస్తోంది. ఆగస్ట్ 28వ తేదీ నుంచి ఈ డ్రా కేటాయించేందుకు లక్కీ డ్రా ప్రక్రియ చేపట్టారు. నాలుగు రోజుల పాటు ఈ డ్రా జరగనుంది. ఇందులో భాగంగా పలు ఆసక్తికర సంఘటనలు చోటుచేసుకున్నాయి. అవేంటి అనేది మిగతా2లో

## సిరిసిల్ల చేనేతలో మరో అద్భుతం





తెలంగాణ పత్రిక ప్రతినిధి: అన్నదాత తర్వాత ఈ దేశానికి వెన్నుముక అయిన నేతన్నల ఘనకీర్తిని మరోసారి ప్రపంచానికి చాటుతూ సిరిసిల్ల ప్రాంతం మరో అద్భుత సృష్టికి వేదికైంది. చేనేత రంగంలో వినుత్న ప్రయోగాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన సిరిసిల్లలో, 'చేనేత కళా రత్న' అవార్డు గ్రహీత నల్లా విజయ్ కుమార్ తన సృజనాత్మకతకు పదును పెట్టి సరికొత్త రికార్డు సృష్టించారు. తన తండ్రి, మిగతా2లో





## డ్రైవర్‌ను అడ్డం పెట్టుకుని కూతురు అకౌంట్‌కు లంచాలు

**మైనింగ్ అధికారి గుట్టురట్టు చేసిన ఏసీబీ**

తెలంగాణ పత్రిక ప్రతినిధి: అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇసుక కాంట్రాక్టర్ల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న మైనింగ్ అధికారి జయరాజు గుట్టును ఏసీబీ రట్టు చేసింది. డ్రైవర్‌ను అడ్డం పెట్టుకుని కుమార్తె బ్యాంక్ ఖాతాకు రూ.లక్షల్లో లంచాలు బదిలీ చేయించిన వ్యవహారం అధికారులనే విస్తుపోయేలా చేసింది. ఏసీబీ సోదాల్లో మిగతా2లో



## ఢిల్లీలో దంపతుల అరెస్ట్..!

**పాక్ ఐఎస్ఐ ఏజెంట్లను పట్టించిన సోషల్ మీడియా పోస్ట్..**

తెలంగాణ పత్రిక ప్రతినిధి: పాకిస్థాన్ ఇంటర్-సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ISI) గూఢచర్య నెట్‌వర్క్‌ను ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ ఛేదించింది. ఈ నెట్‌వర్క్‌తో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలపై ఢిల్లీకి చెందిన సాహిల్ (25), అతని భార్య సమీరా (21)ను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి పెద్ద ఎత్తున సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారున్యూఢిల్లీ పాకిస్థాన్ ఇంటర్-సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ISI) గూఢచర్య నెట్‌వర్క్‌ను ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ ఛేదించింది. 2లో

## ప్లాస్టిక్ ఎక్కడి నుంచి వస్తుంది..?

**99శాతం మందికి తెలియని అవాక్కయ్యే నిజాలు...**




తెలంగాణ పత్రిక ప్రతినిధి: ఉదయం లేచిన దగ్గరి నుంచి రాత్రి పడుకునే వరకు ప్లాస్టిక్ లేని జీవితాన్ని మనం ఊహించలేం. స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, టీవీ, కిచెన్ వస్తువులు.. ఇలా అన్నీ ప్లాస్టిక్‌తోనే ముడిపడి ఉన్నాయి. అయితే మనం నిత్యం వాడే ఈ గట్టి ప్లాస్టిక్ అసలు ఎలా తయారవుతుంది? 2లో

## ఆర్టీసీ ప్రయాణికులు గుడ్‌న్యూస్..



**ఇక కండక్టర్‌తో పనిలేదు.. మీరే డైరెక్ట్ టికెట్ తీసుకోవచ్చు**

తెలంగాణ పత్రిక ప్రతినిధి: ఇప్పటికే ఆన్‌లైన్ టికెటింగ్ విధాన్ని అమల్లోకి తెచ్చి ఆర్టీసి ప్రయాణికులకు చిల్లర బెడద నుంచి తప్పించిన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికుల సౌకర్యార్థం మరో కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చేంది సిద్దమైంది. ఇకపై నాన్‌స్టాప్ బస్సుల్లో సెల్ఫ్ టికెట్ విధాన్ని అమలు చేయనుంది. మిగతా2లో

## నిరుద్యోగులకు గుడ్‌న్యూస్..



**సెప్టెంబరు నుంచి వరుసగా 15 TGPSC ఉద్యోగ నోటిఫికేషన్లు.!** 12

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఈ నెలాఖరు లేదంటే సెప్టెంబరు నుంచి టీజీపీఎస్సీ వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయనుంది.




## తెలంగాణలో పెరిగిన క్రైమ్ రేట్..

- తెలంగాణలో మూడేళ్లలో 7.15 శాతం పెరిగిన మొత్తం నేరాలు
- నార్కోటిక్స్ కేసులు 46 శాతం పెరగడంపై ఆందోళన
- సైబర్ క్రైమ్, ఆర్థిక నేరాల్లో కనిపించిన తగ్గుదల
- తీవ్రమైన నేరాలు తగ్గినా, సాధారణ నేరాలు పెరిగాయన్న గణాంకాలు

తెలంగాణ పత్రిక: తెలంగాణలో గత మూడేళ్లతో పోలిస్తే మొత్తం నేరాల సంఖ్య 7.15 శాతం మేర పెరిగింది. ముఖ్యంగా మాదక ద్రవ్యాలు (నార్కోటిక్స్) సంబంధిత కేసులు 46.10 శాతం పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. డీజీపీ మిగతా12లో

## ఎవరి జాగీరు అని మీ ఫొటోలు వేసుకుంటున్నారు?

**కాంగ్రెస్ నేతలపై ఈటల ఫైర్**



- కేసీఆర్ పాలనకు, రేవంత్ పాలనకు తేడా లేదన్న ఈటల
- సన్న బియ్యం కేంద్రం ఇస్తున్నా మోదీ ఫొటో వేయడం లేదని మండిపాటు
- కేంద్ర నిధుల వల్లే రాష్ట్రంలో రోడ్లు, రైల్వేలు అభివృద్ధి చెందుతున్నాయని వ్యాఖ్య

తెలంగాణ పత్రిక:తెలంగాణలో గత కేసీఆర్ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత రేవంత్ రెడ్డి పాలనకు ఎలాంటి వ్యత్యాసం లేదని... ఈ పాలనతో రాష్ట్ర ప్రజలు పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని భావిస్తున్నారని బీజేపీ ఎంపీ 2లో

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా నిజాన్


# రేవంతన్నా నీకు బంగారమంత ప్రేముంది

ప్రతీ ఏడాదలాగే ఈసారి కూడా సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కట్టానని, ఈసారి ఆయన కోసం ప్రత్యేకంగా తయారు చేయించిన బంగారు రాఖీని అలంకరించినట్లు తెలిపారు. మంత్రి సీతక్కతో కలిసి తాను సీఎంకు రాఖీ కట్టినట్లు సురేఖ చెప్పారు. సీఎం రేవంత్ తో పాటు తన అల్లుడికి, మనవడికి కూడా రాఖీలు కట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తాను రాఖీ కట్టడం ఇది మూడోసారినని ఆమె గుర్తు చేశారు. తాను అందరికీ ఆడపడుచునేనని, తనను ఎవరూ వేరు చేసి చూడవద్దని కోరారు. పండగ వాతావరణంలో ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయనని, ఇక్కడ రాజకీయాలు మాట్లాడకూడదని సురేఖ స్పష్టం చేశారు. పార్టీ పరంగా నోటీసులు, అంతర్గత చర్చలు జరుగుతున్న తరుణంలో మంత్రి సురేఖ నేరుగా సీఎన్ని కలవడం, పండగ వేళ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# రాష్ట్రంలో 15,982 అంగన్‌వాడీ ఉద్యోగాలు..

రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 15,982 పోస్టులను సెప్టెంబరు నెలాఖరులోగా భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మొత్తంగా 3,100 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 12,882 హెల్పర్ పోస్టులు కలిపి 15,982 ఖాళీలను భర్తీ చేయనున్నారు. జిల్లా స్థాయిలో నియామక ప్రక్రియ చేపట్టాలనిహైదరాబాద్, ఆగస్ట్ 28: తెలంగాణలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 15,982 పోస్టులను సెప్టెంబరు నెలాఖరులోగా భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మొత్తంగా 3,100 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 12,882 హెల్పర్ పోస్టులు కలిపి 15,982 ఖాళీలను భర్తీ చేయనున్నారు. జిల్లా స్థాయిలో నియామక ప్రక్రియ చేపట్టాలని అధికారులను సూచించింది. అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ పోస్టులకు ఇంటర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయాలని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలోని రెండు జోన్ల పరిధిలో అంగన్‌వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి వివరాలు ఇలా ఉన్నాయి.జోన్ 1లో 1853 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 7,737 హెల్పర్ పోస్టులు

**జోన్ 2లో 1247 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 5,145 హెల్పర్ పోస్టులు**

**జిల్లా స్థాయిలోనే నియామకాలు**

అభ్యర్థుల ఎంపికలో ఇంటర్ మార్కులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. మొత్తం ఎంపిక ప్రక్రియలో ఇంటర్ మార్కులకు 70 శాతం వెయిటేజీ కేటాయించారు. అదేవిధంగా ఇంటర్వ్యూకు 10 శాతం వెయిటేజీ ఉంటుంది. ప్రత్యేక కేటగిరీలకు కూడా వెయిటేజీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వితంతువులకు 5 శాతం, అనాథలకు 10 శాతం, దివ్యాంగులకు 5 శాతం వెయిటేజీ కల్పించనున్నారు. అంగన్‌వాడీ పోస్టుల భర్తీ ప్రక్రియను జిల్లా స్థాయిలో చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. అర్హత కలిగిన అభ్యర్థులను గుర్తించి, నిర్దేశిత నిబంధనల ప్రకారం ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించింది.ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులను ఎక్కువ కాలం ఖాళీగా ఉంచకుండా సెప్టెంబరు నెలాఖరులోగా నియామక ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో తెలంగాణలో అంగన్‌వాడీ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ఇంటర్ ఉత్తీర్ణ అభ్యర్థులకు ఈ నియామకాలు కీలక అవకాశంగా మారనున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే అధికారికంగా పలు జిల్లాల్లో నోటిఫికేషన్‌లు విడుదల చేసింది. మరికొన్ని జిల్లాల్లో విడుదల చేయాల్సి ఉంది.

# హైదరాబాద్‌లో భూమి ధరల కొత్త రికార్డు..

హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో భూముల ధరలు మరోసారి సరికొత్త రికార్డును సృష్టించాయి. రాయదుర్గంలో తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఎకరం ధర ఏకంగా రూ. 269 కోట్లు పలికింది. ప్రముఖ నిర్మాణ సంస్థ వంశీరాం బిల్డర్స్ ఈ భూమిని అత్యధిక ధరకు దక్కించుకుంది. రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1 పరిధిలోని 5.38 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం వేలానికి ఉంచింది. దీనికి ఎకరానికి రూ. 175 కోట్లను ప్రభుత్వం కనీస ధరగా నిర్ణయించింది. అయితే, ఆన్‌లైన్ వేలంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల మధ్య తీవ్రమైన పోటీ నెలకొనడంతో ధర అనూహ్యంగా పెరిగింది. చివరికి ఎకరం రూ. 269 కోట్ల చొప్పున వంశీరాం బిల్డర్స్ ఈ స్థలాన్ని కైవసం చేసుకుంది. ఈ విక్రయం ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ. 1,447 కోట్ల భారీ ఆదాయం సమకూరింది. వారం రోజుల క్రితమే ఈ ప్రాంతానికి సమీపంలోని మరో ప్లాట్ ఎకరం రూ. 264 కోట్లకు అమ్ముడై రికార్డు సృష్టించగా, తాజా వేలం ఆ రికార్డును అధిగమించింది. రాయదుర్గం పరిసరాల్లో గత కొంతకాలంగా భూముల ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. గతేడాది అక్టోబర్‌లో ఎకరం ధర రూ. 177 కోట్లు ఉండగా, ఈ ఏడాది మే నెలలో అది రూ. 237 కోట్లకు చేరింది. తాజాగా ఈ ధర రూ. 269 కోట్ల మైలురాయిని చేరుకోవడం గమనార్హం. హైదరాబాద్ ఐటీ హబ్, గచ్చిబౌలి, నాలెడ్జ్ సిటీ వంటి కీలక ప్రాంతాలకు అత్యంత సమీపంలో ఉండటంతో ఇక్కడి భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ గిరాకీని ఆదాయంగా మార్చుకునే క్రమంలో ప్రభుత్వం చేపడుతున్న భూముల వేలానికి రియల్ ఎస్టేట్ రంగం నుంచి భారీ స్థాయిలో స్పందన లభిస్తోంది.

# హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది

కేటాయించేందుకు లక్కీ డ్రా ప్రక్రియ చేపట్టారు. నాలుగు రోజుల పాటు ఈ డ్రా జరగనుంది. ఇందులో భాగంగా పలు ఆసక్తికర సంఘటనలు చోటుచేసుకున్నాయి. అవేంటి అనేది చూద్దాంహైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్‌లో ప్లాట్ల కేటాయింపునకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం లక్కీ డ్రా ద్వారా లబ్దిదారులను ఎంపిక చేస్తోంది. ఆగస్ట్ 28వ తేదీ నుంచి ఈ డ్రా ప్రారంభమవ్వగా.. ఒక ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మైలార్ దేవుపల్లిలోని లక్ష్మీగూడలో ఒక బాలుడితో లక్కీ డ్రా తీయించగా.. ఆశ్చర్యకర ఘటన జరిగింది. లక్కీ డ్రా తీసిన పిల్లవాడి కుటుంబానికి ఇల్లు దక్కింది. దీంతో అక్కడ ఉన్నవారందరూ దీనిని చూసి ఆశ్చర్యపోయారు. ఈ విషయాన్ని గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన ఎక్స్ అకౌంట్‌లో పోస్ట్ చేశారు.ఆగస్ట్ 28వ తేదీన నాంపల్లి, కుత్బుల్లాపూర్, సికింద్రాబాద్, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కోసం లక్కీడ్రా కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించాం. చిన్నారుల చేతుల మీదుగా లక్కీడ్రా టోకెన్లు తీయించాం. అనంతరం ఎంపికైన లబ్దిదారుల పేర్లు ప్రకటించి శుభాకాంక్షలు తెలిపాం. ఈ సందర్భంగా జరిగిన కొన్ని సంఘటనలు ఆశ్చర్యానికి గురి చేశాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఒక చిన్నోడితో టోకెన్ తీయించగా.. ఆ పిల్లవాడి కుటుంబం పేరే వచ్చింది. నాంపల్లి నియోజకవర్గంలో తొలి టోకెన్ ఒక చిన్నారితో తీపించాను. ఆ తదుపరి తీసిన కొన్ని టోకెన్ల తరువాత.. మొదటి టోకెన్ తీసిన చిన్నారి కుటుంబం కూడా లక్కీడ్రాలో ఎంపికైంది. ఈ రెండు విషయాలు నాకు సంతోషంతో పాటు ఆశ్చర్యాన్ని కల్గించాయి" అని మంత్రి పొంగులేటి ఎక్స్‌లో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణంపై పొంగులేటి క్లారిటీ ఇచ్చారు. లక్కీడ్రా పూర్తయిన తర్వాత లబ్ధిదారుల తుది ఎంపిక జరుగుతుందని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం మంజూరు పత్రాలు అందిస్తారని స్పష్టం చేశారు. అనంతరం 3 నుంచి 4 రోజుల్లోనే టవర్స్ నిర్మాణ పనులు మొదవరమ్మ టవర్స్ నిర్మాణంలో ఉన్నప్పుడు లబ్ధిదారులు ఎప్పుడైనా వెళ్లి వాటిని చూసుకోవచ్చని తెలిపారు. నిర్మాణాలకు సంబంధించి నాణ్యతను పరిశీలించుకునే హక్కు లబ్దిదారులకు ఎప్పుడూ ఉంటుందని అన్నారు. పారదర్శకంగా ఫ్లాట్ల నిర్మాణాలు చేపడతామని, ఎలాంటి అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. నాలుగు రోజుల పాటు ఈ లక్కీ డ్రా జరగనుంది. ఈ నెల 31వ తేదీతో ఈ ప్రక్రియ పూర్తి కానుండగా.. అనంతరం త్వరతగతిన నిర్మాణ పనులు చేపట్టనున్నారు. నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత లబ్దిదారులు గృహప్రవేశం చేస్తారు. హైదరాబాద్‌లోని 16 నియోజకవర్గంలో 480 ఫ్లాట్లకు 600 మంది లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తారు. అనంతరం క్షేత్రస్థాయి పరిశీలతో ఎవరైనా అనర్హులుగా తేలితే వారి స్థానంలో అర్హులైనవారికి కేటాయిస్తారు.

# సిరిసిల్ల చేనేతలో మరో అద్భుతం..

అన్నదాత తర్వాత ఈ దేశానికి వెన్నుముక అయిన నేతన్నల ఘనకీర్తిని మరోసారి ప్రపంచానికి చాటుతూ సిరిసిల్ల ప్రాంతం మరో అద్భుత సృష్టికి వేదికైంది. చేనేత రంగంలో వినుత్న ప్రయోగాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన సిరిసిల్లలో, 'చేనేత కలారత్న' అవార్డు గ్రహీత నల్లా విజయ్ కుమార్ తన సృజనాత్మకతకు పదునుపెట్టి సరికొత్త రికార్డు సృష్టించారు. తన తండ్రి, దివంగత చేనేత కలశిల్పి నల్లా పరంధాములు అప్పట్లో అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీరను నేసి ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ఆశీస్సులతో, విజయ్ కుమార్ అదే వారసత్వాన్ని ముందుకు తీసుకువెళు తున్నారు. తాజాగా అమెరికాలోని 'నాపా' (చీపూరూ) ఈవెంట్ నిర్వాహకులు ప్రత్యేకమైన డిజైన్‌తో కూడిన చీరను అందించాలని కోరగా, విజయ్ కుమార్ దీనిని ఒక సవాలుగా స్వీకరించారు. పౌర్ణమి చంద్రుడి వెన్నెల కాంతిని ప్రతిబింబించేలా అద్భుతమైన రంగును ఎంపిక చేసి, 'వెండి వెన్నెల పూల చీర'ను రూపుదిద్దారు. ఈ చీర ప్రత్యేకత ఏమిటంటే, ఇందులో అచ్చంగా 108 వెండి పూలను అత్యంత ఆకర్షణీయంగా అమర్చారు. ఈ అద్భుతమైన డిజైన్‌ను మగ్గంపై తీర్చిదిద్దేందుకు ఆయన సుమారు వారం రోజుల పాటు శ్రమించాల్సి వచ్చిందని తెలిపారు. ఈ సరికొత్త చీర పొడవు 5.25 మీటర్లు కాగా, వెడల్పు 48 అంగుళాలు, బరువు కేవలం 800 గ్రాములు మాత్రమే ఉండటం విశేషం. చేనేత కళారంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ రూపొందించిన ఈ వెండి వెన్నెల పూల చీర ప్రస్తుతం సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. సిరిసిల్ల చేనేత ఖ్యాతిని ఖండాంతరాలు దాటించేలా భవిష్యత్తులోనూ మరెన్నో వినూత్న ప్రయోగాలు చేస్తానని, నేతన్నల కళకు ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చేందుకు నిరంతరం కృషి చేస్తానని నల్లా విజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు.

# డ్రైవర్‌ను అడ్డం పెట్టుకుని కూతురు అకౌంట్‌కు లంచాలు..

అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇసుక కాంట్రాక్టర్ల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న మైనింగ్ అధికారి జయరాజు గుట్టును ఏసీబీ రట్టు చేసింది. డ్రైవర్‌ను అడ్డం పెట్టుకుని కుమార్తె బ్యాంక్ ఖాతాకు రూ.లక్షల్లో లంచాలు బదిలీ చేయించిన వ్యవహారం అధికారులనే విస్తుపోయేలా చేసింది. ఏసీబీ సోదాల్లో ఏం బయటపడ్డాయో ఈ స్టోరీలో తెలుసుకుందాం.. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలతో తెలంగాణ గనుల శాఖ అధికారి బి.జయరాజుపై ఏసీబీ కొరడా ఝుళిపించింది. గురువారం జయరాజుతో పాటు ఆయన బంధువులు, సన్నిహితులకు చెందిన మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు ఏకకాలంలో ఆకస్మిక సోదాలు నిర్వహించాయి. ఈ తనిఖీల్లో భారీగా స్థిర, చర ఆస్తులను అధికారులు గుర్తించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న బి.జయరాజు.. ప్రస్తుతం వరంగల్ డిప్యూటీ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పదవిని అడ్డం పెట్టుకుని భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు వచ్చిన పక్కా సమాచారంతో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు.సోదాల్లో బయటపడ్డ ఆస్తుల వివరాలు నిర్వహించిన సోదాల్లో ఇప్పటివరకు సుమారు రూ.3.06 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది. బయటపడిన వాటిలో జీ౦2 అంతస్తుల భవనం, ఒక అపార్ట్‌మెంట్ ఫ్లాట్ ఐదు ఓపెన్ ప్లాట్లు, 3.21 ఎకరాల వ్యవసాయ భూమి, రూ.10 లక్షల నగదు, 629 గ్రాముల బంగారు ఆభరణాలు, మూడు లగ్జరీ కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, పోస్టాఫీసు సేవింగ్స్ ఖాతాల్లో రూ. 20.86 లక్షలు, మూడు బ్యాంకు ఖాతాల్లో రూ. 71.27 లక్షల నగదు నిల్వలు ఉన్నాయి.డ్రైవర్ ఖాతా ద్వారా కుమార్తెకు ముడుపుల మళ్లింపు ఈ సోదాల్లో అత్యంత కీలకమైన అక్రమ లావాదేవీల నెట్‌వర్క్ వెలుగుచూసింది. జయరాజు వ్యక్తిగత డ్రైవర్ మొబైల్ ఫోన్, బ్యాంక్ ఖాతాలను పరిశీలించగా.. డ్రైవర్ అకౌంట్ నుంచి జయరాజు కుమార్తె బ్యాంకు ఖాతాకు విడతల వారీగా దాదాపు రూ. 24.80 లక్షలు బదిలీ అయినట్లు తేలింది. ఇసుక రవాణా, ఇతర మైనింగ్ కాంట్రాక్టర్ల నుంచి డ్రైవర్ ద్వారా డబ్బులు వసూలు చేయించి, ఆ మొత్తాన్ని నేరుగా కూతురు ఖాతాకు మళ్లించినట్లు విచారణలో డ్రైవర్ అంగీకరించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ ముడుపుల వ్యవహారం వెనుక ఇంకా ఎవరెవరి పాత్ర ఉందనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇప్పటివరకు లెక్క తేలిన ఆస్తుల మార్కెట్ విలువ బహిరంగ మార్కెట్లో మరింత ఎక్కువగా ఉంటుందని, ఈ కేసులో లోతైన విచారణ కొనసాగుతోందని ఏసీబీ స్పష్టం చేసింది.

## పాక్ ఐఎస్ఐ ఏజెంట్లను పట్టించిన సోషల్ మీడియా పోస్ట్..

**ఢిల్లీలో దంపతుల అరెస్ట్..!**

పాకిస్థాన్ ఇంటర్-సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (×ూ×) గూఢచర్య నెట్‌వర్క్‌ను ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ ఛేదించింది. ఈ నెట్‌వర్క్‌తో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలపై ఢిల్లీకి చెందిన సాహిల్ (25), అతని భార్య సమీరా (21)ను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి పెద్ద ఎత్తున సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారున్యూఢిల్లీ పాకిస్థాన్ ఇంటర్-సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (×ూ×) గూఢచర్య నెట్‌వర్క్‌ను ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ ఛేదించింది. ఈ నెట్‌వర్క్‌తో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలపై ఢిల్లీకి చెందిన సాహిల్ (25), అతని భార్య సమీరా (21)ను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి పెద్ద ఎత్తున సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారుపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాహిల్‌కు 2024లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పాకిస్థాన్‌కు చెందిన ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అనంతరం ఆ పరిచయం గూఢచర్య కార్యకలాపాలకు దారితీసినట్లు దర్యాప్తులో తేలింది. సాహిల్, సమీరా పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లతో సంప్రదింపులు జరుపుతూ భారతదేశానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని చేరవేసేందుకు సహకరించినట్లు పోలీసులు పేర్కొన్నారు.2024-25 మధ్య ఈ దంపతులు ఎనిమిది భారతీయ సిమ్ కార్డులను సేకరించి, వాటిని దుబాయ్ మీదుగా పాకిస్థాన్‌కు పంపినట్లు పోలీసులు చెబుతున్నారు. ఇందుకు గాను వారికి సుమారు రూ.30 వేల వరకు నగదు చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ సిమ్‌లతో పాకిస్థాన్‌లో వాట్సాప్ ఖాతాలను యాక్టివేట్ చేసి, భారతీయులను సంప్రదించేందుకు ఉపయోగించినట్లు దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. అంతేకాకుండా కొన్ని ఖాతాల ద్వారా భారతీయ వాట్సాప్ గ్రూపుల్లోకి ప్రవేశించి సమాచారం సేకరించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు గుర్తించారు. సైనిక ప్రాంతాలపై రెక్కీ..! సాహిల్‌కు భారతదేశంలోని వివిధ కంటోన్మెంట్ ప్రాంతాలను పరిశీలించడం, గూఢచర్య కార్యకలాపాలకు అవసరమైన సమాచారాన్ని సేకరించడం, ఇతర వ్యక్తులను నెట్‌వర్క్‌లోకి తీసుకురావడం వంటి బాధ్యతలు అప్పగించినట్లు పోలీసులు వెల్లడించారు. కోర్ట్ మార్షల్ ఎదుర్కొంటున్న సైనిక సిబ్బందికి సంబంధించిన సమాచారాన్ని కూడా సాహిల్ అందించినట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు. సాహిల్‌ను ఢిల్లీలోని సరాయ్ కాలే ఖాన్ ప్రాంతంలో తొలుత అరెస్టు చేసిన పోలీసులు.. అతని మొబైల్ ఫోన్‌ను ఫోరెన్సిక్‌గా పరిశీలించారు. అందులో పాకిస్థాన్‌కు చెందిన హ్యాండ్లర్లతో జరిగిన సంభాషణలు లభించినట్లు తెలిపారు. వాటి ఆధారంగా సమీరా పాత్రను గుర్తించి ఆమెను కూడా అరెస్టు చేశారు. నిందితుల నుంచి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. వాటిలోని డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌కు ఇంకా ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయి? ఆర్థిక లావాదేవీలు ఎలా జరిగాయి? మరెవరైనా ఇందులో భాగస్వాములయ్యారా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.

# ప్లాస్టిక్ ఎక్కడి నుంచి వస్తుంది..?

ఉదయం లేచిన దగ్గరి నుంచి రాత్రి పడుకునే వరకు ప్లాస్టిక్ లేని జీవితాన్ని మనం ఊహించలేం. స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, టీవీ, కిచెన్ వస్తువులు.. ఇలా అన్నీ ప్లాస్టిక్‌తోనే ముడిపడి ఉన్నాయి. అయితే మనం నిత్యం వాడే ఈ గట్టి ప్లాస్టిక్ అసలు ఎలా తయారవుతుంది? ఇది ప్రకృతి నుంచి వస్తుందా లేక ఫ్యాక్టరీల్లో పుడుతుందా? అనే ఆసక్తికరమైన విషయాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం.. ఉదయం బ్రష్ చేసుకోవడం నుంచి రాత్రి పడుకునే ముందు వాడే స్మార్ట్‌ఫోన్ వరకు.. ప్రతిచోటా ప్లాస్టిక్ మన జీవితంలో ఒక భాగమైపోయింది. కుర్చీలు, బల్లలు, టీవీలు, ఫ్రిజ్‌లు, స్విచ్‌లు, ఛార్జర్లు.. ఇలా నిత్యం చేతుల్లో పట్టుకునే ఈ గట్టి ప్లాస్టిక్ అసలు ఎక్కడి నుంచి వస్తుంది? ఇది ప్రకృతి సిద్ధమైనదా లేక రసాయన సమ్మేళనమా? ఎలక్ట్రానిక్స్ రంగంలో దీని ప్రాధాన్యత ఏమిటి? డౌట్లు చాలా మందికి ఉంటాయి. అందరూ అనుకుంటున్నట్లు ప్లాస్టిక్ చెట్ల నుంచో లేదా ప్రకృతి నుంచో నేరుగా లభించదు. ఇది ముడి చమురు, సహజ వాయువు వంటి శిలాజ ఇంధనాల ద్వారా తయారవుతుంది. రిఫైనరీలలో ముడి చమురును శుద్ధి చేసినప్పుడు నాఫ్తా వంటి రసాయనాలు వెలువడతాయి. వీటి నుంచి ఇథిలీన్, ప్రొపిలీన్ వంటి సమ్మేళనాలను వేరుచేసి.. పాలిమరైజేషన్ అనే రసాయన ప్రక్రియ ద్వారా పొడవైన గొలుసుల వంటి అణువులతో పాలిమర్లను తయారు చేస్తారు. వీటికి వివిధ రసాయనాలను జోడించి పాలిథిలిన్, పాలిప్రొపిలిన్, పీవీసీ, ఏబీఎస్, పాలికార్బోనేట్ వంటి విభిన్న రకాల ప్లాస్టిక్‌లను ఉత్పత్తి చేస్తారుఎలక్ట్రానిక్స్ -- గృహోపకరణాల్లో ఎందుకంత కీలకం? ఫర్నిచర్ తయారీలో దృఢంగా, తేలికగా ఉండే పాలిప్రొపిలిన్ లేదా హెచ్‌డీపీఈ వాడితే.. టీవీలు, స్మార్ట్‌ఫోన్ల బాడీ కేసింగ్‌ల కోసం అధిక ఉష్ణ నిరోధకత, పటిష్టత కలిగిన ఏబీఎస్, పాలికార్బోనేట్ వంటి ఇంజనీరింగ్ ప్లాస్టిక్‌లను ఉపయోగిస్తారు. వీటికి గల ముఖ్యమైన లక్షణాలు..

విద్యుత్ నిరోధకత: లోహాల వలె ప్లాస్టిక్ విద్యుత్‌ను ప్రసరింపజేయదు. అందుకే వైర్లు, ప్లగ్‌లు, స్విచ్‌లు, ఛార్జర్లలో షాక్ కొట్టకుండా రక్షణగా దీన్ని వాడతారు.

తక్కువ బరువు -- మన్నిక: లోహాలతో పోలిస్తే తేలికగా ఉండి, తుప్పు పట్టని గుణం కలిగి ఉంటుంది.

సులభమైన తయారీ: ఏ ఆకారంలోకైనా సులభంగా మలచవచ్చు, ఉత్పత్తి ఖర్చు కూడా చాలా తక్కువ.

**పర్యావరణ సవాల్ -- బాధ్యతాయుత వినియోగం**

ప్లాస్టిక్ చెట్ల నుండి వస్తుందనేది అపోహ మాత్రమే. రబ్బరు చెట్ల నుంచి వచ్చే లేటెక్స్ వేరు, ప్లాస్టిక్ వేరు. ప్రస్తుతం మొక్కజొన్న, చెరకు వంటి వాటితో బయోప్లాస్టిక్స్ తయారు చేస్తున్నప్పటికీ పారిశ్రామికంగా పెట్రోలియం ఆధారిత ప్లాస్టిక్‌లదే పైచేయి. అయితే ప్లాస్టిక్ సహజంగా త్వరగా మట్టిలో కలిసిపోదు. ఈ వ్యర్థాలు నదులు, సముద్రాల్లోకి చేరి జలచరాల ప్రాణాలకే ముప్పుగా మారుతున్నాయి. అందువల్ల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తగ్గించడం, వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడం, ఆహారాన్ని వేడిచేసేటప్పుడు సురక్షితమైన గ్రేడ్ ప్లాస్టిక్ వాడటం మనందరి బాధ్యత.

# ఆర్టీసీ ప్రయాణికులు గుడ్‌న్యూస్..

ఇప్పటికే ఆన్‌లైన్ టికెటింగ్ విధాన్ని అమల్లోకి తెచ్చి ఆర్టీసి ప్రయాణికులకు చిల్లర బెడద నుంచి తప్పించిన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికుల సౌకర్యార్థం మరో కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చేంది సిద్ధమైంది. ఇకపై నాన్‌స్టాప్ బస్సుల్లో సెల్ఫ్ టికెట్ విధాన్ని అమలు చేయనుంది. ఇకపై కండక్టర్ అవసరం లేకుండానే ప్రయాణికులే నేరుగా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చికెట్ తీసుకోవచ్చు.తెలంగాణ ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యం కోసం మరో కొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకురాబోతోంది తెలంగాణ రాష్ట్రరోడ్డు రవాణా సంస్థ. నాన్‌స్టాప్ బస్సుల్లో ప్రయాణించే వారికి టికెట్ తీసుకునే ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు సెల్ఫ్ టికెటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఇక బస్సు ఎక్కే సమయంలో కండక్టర్ కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా.. ప్రయాణికులే తమ టికెట్‌ను స్వయంగా బుక్ చేసుకునే అవకాశం కల్పించనుందిఈ విధానంలో భాగంగా బస్సు డోర్ వద్ద ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తారు. ప్రయాణికులు తమ స్మార్ట్‌ఫోన్‌తో ఆ కోడ్‌ను స్కాన్ చేస్తే టికెట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అనంతరం ఎక్కడి నుంచి బస్సు ఎక్కుతున్నారో, ఏ స్టాప్‌లో దిగాలనుకుంటున్నారో వివరాలను నమోదు చేయాలి. ఆన్‌లైన్‌లో చెల్లింపు పూర్తిచేసిన వెంటనే టికెట్ జనరేట్ అవుతుంది. బస్సులోకి ఎక్కిన తర్వాత ఆ టికెట్‌ను డ్రైవర్‌కు చూపిస్తే ప్రయాణం కొనసాగించవచ్చు. దీంతో టికెట్ కోసం బస్సు వద్ద సమయం వృథా కాకుండా ప్రయాణికులు త్వరగా తమ గమ్యస్థానానికి చేరుకునే అవకాశం ఉంటుంది. ఈ సెల్ఫ్ టికెటింగ్ విధానాన్ని మొదటగా నల్గొండ--హైదరాబాద్ మార్గంలో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. ప్రస్తుతం ఈ మార్గంలో సుమారు 45 డీలక్స్ నాన్‌స్టాప్ బస్సులు నడుస్తున్నాయి. ఈ రూట్‌లో కొత్త విధానం ఎలా పనిచేస్తుందో పరిశీలించిన తర్వాత.. ఫలితాలు సంతృప్తికరంగా ఉంటే ఇతర నాన్‌స్టాప్ రూట్లకు కూడా విస్తరించాలని అధికారులు భావిస్తున్నారు. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే సెప్టెంబర్ నెలాఖరు నాటికి మరిన్ని రూట్లలో సెల్ఫ్ టికెటింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆర్టీసీ లక్ష్యంగా పెట్టుకుంది.కొత్త విధానం అమలుతో చిల్లర సమస్యకు చెక్ పడటంతో పాటు టికెట్ జారీ చేసే ప్రక్రియలో సమయం కూడా ఆదా అవుతుందని ఆర్టీసీ భావిస్తోంది. ముఖ్యంగా నాన్‌స్టాప్ సర్వీసుల్లో టికెట్ల జారీ బాధ్యత తగ్గడంతో డ్రైవర్లపై ఉండే పనిభారం కూడా కొంత మేర తగ్గే అవకాశం ఉంది.

# లిమియాపూర్‌లో అక్రమ షెడ్లపై జీహెచ్ఎంసీ కొరడా

-బీకే ఎన్క్లేవ్ వద్ద అక్రమ నిర్మాణాల కూల్చివేతలు



రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆగస్టు 28 : (తెలంగాణ పత్రిక)



మియాపూర్: జీహెచ్ఎంసీ మియాపూర్ సర్కిల్--48 పరిధిలో అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝళిపించారు. మియాపూర్ బీకే ఎన్క్లేవ్ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన షెడ్లపై జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. అధికారుల బృందం డెమాలిషన్ యంత్రాలతో అక్కడికి చేరుకుని అక్రమంగా నిర్మించిన షెడ్లను కూల్చివేసింది. నిర్మాణాలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులు, నిబంధనల ఉల్లంఘనలపై పరిశీలన అనంతరం ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. అక్రమ నిర్మాణాలకు అనుమతులు లేకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడం వంటి అంశాలను అధికారులు పరిశీలించినట్లు తెలిసింది. నగరంలో అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేస్తున్నారు. మియాపూర్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందిన ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతాయని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలపై దశలవారీగా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం..

# ఘనంగా యజుర్వేద ఉపాకర్మ వేడుకలు

-చందానగర్‌లో వేదోక్తంగా నిర్వహణ.. నూతన యజ్ఞోపవీత ధారణ



రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆగస్టు 28 :( తెలంగాణ పత్రిక)

శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్ పరిధిలోనీ లక్ష్మీగణపతి బ్రాహ్మణ సంఘం చందానగర్ శాఖ ఆధ్వర్యంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని యజుర్వేద ఉపాకర్మ వేడుకలను శుక్రవారం సీతారామాంజనేయ దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ఘనాపాటి హరి సీతారామమూర్తి నేతృత్వంలో వేద పండితుల బృందం ఉపాకర్మ కార్యక్రమాన్ని వేదోక్తంగా నిర్వహించింది. ఈ సందర్భంగా భక్తులు నూతన యజ్ఞోపవీత ధారణ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేదాలను అందించిన పూర్వపు ఋషులు, పితృదేవతలను స్మరించుకుంటూ ఘనంగా తర్పణాలు సమర్పించారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణల నడుమ హోమ కార్యక్రమాన్ని నిర్వహించి పూర్ణాహుతితో ఉపాకర్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా ముగించారు. కార్యక్రమం అనంతరం ఘనాపాటి హరి సీతారామమూర్తిని లక్ష్మీగణపతి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు తాంబూలంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీగణపతి బ్రాహ్మణ సంఘం ప్రతినిధి శశిధర్‌తో పాటు సంఘం ప్రతినిధులు, సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు..

# రాఖీ పౌర్ణమి రోజు మంత్రపురి శ్రీ రాజరాజేశ్వరస్వామి కి ప్రత్యేక పూజలు



మంథని, ఆగస్టు 28 (తెలంగాణ పత్రిక) :

రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం మంథని పట్టణంలోని మంత్రపురి శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయానికి గోముఖం, సౌండ్ సిస్టమ్ అందజేసిన దాతలకు ఈ సందర్భంగా కమిటీ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భక్తులు, దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

# రాఖీ కట్టిన తిరుపతి ముదిరాజ్ సోదరీమణులు



(కల్వకుర్తి ప్రతినిధి) 28 ఆగస్టు

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని తలకొండపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జుట్టు తిరుపతి ముదిరాజ్ స్వగృహంలో ఆయన సోదరీమణులు రాఖీ కట్టి ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోదరీమణులు తిరుపతి ముదిరాజ్‌కు రాఖీ కట్టి, ఆయన ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రక్షాబంధన్ సోదర, సోదరీమణుల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, రక్షణకు ప్రతీకగా జరుపుకునే పర్వదినం. సోదరీమణులు సోదరుల చేతికి రాఖీ కట్టి వారి క్షేమాన్ని కోరుకోవడం, సోదరులు తమ సోదరీమణులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇవ్వడం ఈ పండుగ ప్రత్యేకత. ఈ సందర్భంగా తిరుపతి ముదిరాజ్ మాట్లాడుతూ, రాఖీ పండుగ సోదర, సోదరీమణుల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే పవిత్రమైన పండుగ అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషం, శాంతి, సౌభాగ్యం నెలకొనాలని ఆకాంక్షించారు.

# గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దంపతులు

జగిత్యాల, ఆగస్టు 28 (తెలంగాణ పత్రిక):





జగిత్యాల అర్బన్ మండల్ అంబారిపేట శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి గిరి ప్రదక్షిణలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ రాధిక దంపతులు పాల్గొన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు అంబారిపేట గ్రామ ప్రజలపై జగిత్యాల నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో పాడి పంటలతో అభివృద్ధి చెందాలని కోరారు. మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ ఆలయాలను అభివృద్ధి చేసుకోవడం ఇతర మతాలను గౌరవించడం మనందరి బాధ్యత అని భక్తుల సౌకర్యాల కోసం ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోడిశెల గంగాధర్ ఏఎంసీ చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి ఉప సర్పంచ్ గంగాధర్ ఆలయ చైర్మెన్ మల్లేశం సమిండ్ల శ్రీనివాస్ బాల ముకుందం తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి కి రాఖీ కట్టిన గడ్డం ఇందుప్రియ

కామారెడ్డి ,ఆగస్టు 28,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



రాఖీ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నివాసంలో కామారెడ్డిమాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి రాఖీ కట్టి, రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షా బంధన్ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి కి రాఖీ కట్టడం ఎంతో ఆనందంగా ఉందని గడ్డం ఇందుప్రియ తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గడ్డం ఇందుప్రియకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాఖీ పండుగ సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయతలను మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు.

# రోడ్డు నిర్మించారు.... గ్రావెల్స్ వేయడం మరిచారు

ముధోల్:ఆగస్టు28(తెలంగాణ పత్రిక)



నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ లోని ప్రధాన రహదారులకు ఇటీవల లక్షల నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు.కానీ రోడ్డుకు ఇరు ప్రక్కల కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల గ్రావెల్స్ వేయకపోవడంతో ప్రమాదా లు చోటు చేసుకుంటున్నాయి. శుక్రవారం సాయి మాధవ్ నగర్ రోడ్డు నుండి కారు గ్రామంలోకి వస్తుండగా రోడ్డు కిందికి వెళ్ళిపోయింది.దీంతో డ్రైవర్ ఒకేసారి అప్రమత్తమై బ్రేక్ వేయడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. రోడ్డుకు ఇరుపక్కల గ్రావెల్స్ వేయకపోవ డంతోనే ఈ ప్రమాదం జరిగింది. సదరు కాంట్రాక్ట ర్ రహదారి పనులు పూర్తి చేసుకుని మమ అనిపించుకున్నాడు. ఇటీవల ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు. అసంపూర్తి పనులతో ప్రజల భద్రత కు ముప్పు వాటిల్లకముందే అధికారులు చర్యలు తీసుకోవాల ని స్థానికు లు డిమాండ్ చేస్తున్నా రు. ఇప్పటి కైనా సదరు కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరు పక్కల గ్రావెల్స్ వేయా లని పలువురు కోరుతున్నారు.

# రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

-జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్

జగిత్యాల పట్టణ ప్రతినిధి (తెలంగాణ పత్రిక) ఆగష్టు 28



జగిత్యాల జిల్లాలో చేపట్టిన గ్రామాల రీ సర్వేను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఆధ్వర్యంలో తహసీల్దార్లు, గిర్దావర్లు,గ్రామ పాలనాధికారులకు రీ సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి భూ కమతాన్ని ఖచ్చితంగా కొలిచి భూ రికార్డులను నవీకరించాలని సూచించారు.భూ యజమానుల హక్కుల పరిరక్షణ, భవిష్యత్ భూ వివాదాల నివారణే రీ సర్వే ప్రధాన లక్ష్యమన్నారు. గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ, అటవీ, చెరువులు, కుంటలు, రహదారులు, శ్మశానవాటికలు తదితర భూములను స్పష్టంగా గుర్తించి రికార్డు చేయాలని ఆదేశించారు.భూ యజమానుల సమక్షంలో హద్దులను నిర్ధారించి, అభ్యంతరాలు, క్లెయిమ్‌లను నిష్పక్షపాతంగా పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్. లతతో పాటు వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, సర్వేయర్లు, గిర్దావర్లు, గ్రామ పాలనాధికారులు పాల్గొన్నారు.

# సోదరులకు రాఖీ కట్టిన మాజీ ఎమ్మెల్యే హరిప్రియ



తెలంగాణ పత్రిక, ఇల్లందు ఆర్సీ(ఆగస్టు28):

రక్షాబంధన్ సందర్భంగా ఇల్లందు నియోజకవర్గ మాజీ శాసనసభ్యురాలు, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ బానోత్ హరిప్రియ నాయక్ తన సోదరులకి రాఖీకట్టి స్వీట్స్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా పార్టీలోని పలువురు నాయకులకు సైతం మాజీ ఎమ్మెల్యే హరిప్రియ రాఖీ కట్టడం జరిగింది.

# కౌన్సిలర్ దండు సారయ్య ఇంట రాఖీపౌర్ణమి సందడి



తెలంగాణ పత్రిక, ఇల్లందు ఆర్సీ(ఆగస్టు28):



రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య ఇళ్లు రాఖీ వేడుకలతో సందడిగా మారింది. ఈ మేరకు దండు సారయ్య చెల్లెళ్ళు ఆయనకు తిలకం దిద్ది హారతి ఇచ్చి రాఖీ కట్టి మిఠాయి తినిపించి ఆశీర్వచనం తీసుకున్నారు. అదేవిధంగా 18వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ పాబోలు స్వాతి సారయ్యకు రాఖీ కట్టారు. అలానే ఇల్లందు పట్టణం, వార్డులోని పలువురు మహిళలు దండు సారయ్యకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

# పాపన్నపేటలో ఆత్మీయ దృశ్యం

-బ్లూ కోట్ పోలీసులకు రాఖీ కట్టిన ఓ సోదరి

పాపన్నపేట, ఆగస్టు 28:(తెలంగాణ పత్రిక)





అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి పర్వదినాన ఓ ఆత్మీయ దృశ్యం పాపన్నపేటలో ఆవిష్కృతమైంది. ప్రజల రక్షణలో భాగంగా విధులు నిర్వహిస్తున్న మెదక్ జిల్లా పాపన్నపేట బ్లూ కోట్ పోలీసులకు ఓ సోదరి రాఖీ కట్టి పోలీసులపై తనకున్న అభిమానాన్ని, చాటుకున్నారు. చెల్లికి అన్న రక్షణ.. సమాజానికి పోలీసు రక్షణ అంటూ పోలీసులకు రాఖీ కట్టి ఆమె రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులకు దూరంగా ఉన్నప్పటికీ పండగ రోజున సైతం ప్రజల భద్రత కోసం విధులు నిర్వహిస్తున్న పోలీసుల సేవలు అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. కుటుంబానికి దూరంగా ఉంటూ విధులు నిర్వహిస్తున్న తమకు ఒక సోదరి ప్రేమభిమానంతో రాఖీ కట్టడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.

తెలంగాణ పత్రిక TELANGANA PATRIKA TELUGU DAILY తెలుగు దిన పత్రిక నిజం మా నైజం



# ఘనంగా రక్షాబంధన్

-రాఖీ కట్టిన చెల్లె.. ప్రేమతో మురిసిన అన్నయ్య



తానూర్:28ఆగస్టు(తెలంగాణ పత్రిక)

అన్నా చెల్లెళ్ల ప్రతీకకు అనుబంధంగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను మండల వ్యాప్తంగా ప్రజలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టేందుకు పుట్టింటికి బయలుదేరి వెళ్లారు. రాఖీ కట్టి మిఠాయిలు తినిపించిన అక్క చెల్లెళ్లకు సోదరులు తమకు తోచిన విధంగా కట్న కానుకలు సమర్పించి ఆశీర్వాదం తీసుకొని ప్రేమను చాటుకున్నారు.అలాగే హాస్టళ్లో ఉంటున్న చెల్లెళ్ల వద్దకు వెళ్లిన అన్నయ్యలు రాఖీ కట్టించుకుని సోదర బంధాన్ని చాటుకున్నారు. దూర ప్రాంతాల నుంచి సోదరీమణులు రావడంతో మండలంలో సందడి వాతావరణం నెలకొంది. స్వీట్ హౌస్ లు, రాఖీ సెంటర్లు, కలకలాడాయి.

## తెగిపడి ఉన్న విద్యుత్ తీగలు తగిలి నాలుగు గొర్రెలు రెండు మేకలు మృతి

నిర్మల్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 28 తెలంగాణ పత్రిక



నిర్మల్ జిల్లా దిలవర్ పూర్ మండల్ కాల్వ గ్రామానికి చెందిన కురుమే నడిపి సాయన్న కుమారుడు దేవన్న కు అందాజ 160 నుండి 170 వరకు గొర్రెలు కలవు అయితే కురుమే దేవన్న రోజు లాగానే తన గొర్రెల మందను అందాజా 10 గంటల సమయంలో కాల్వ ఊరిలో నుండి వాటిని మేపడానికి తీసుకువెళ్లారు అయితే గొర్రెలు మేసే క్రమంలో నిర్మల్ కు చెందిన శనిగరపు భూమన్న తన తోట పక్కన విద్యుత్ తీగలు తెగిపడిపోవడంతో గురువారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఆ యొక్క విద్యుత్ తీగలకు నాలుగు గొర్రెలు రెండు మేకపోతులు విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి వీటి విలువ అందాజా ఒక్క లక్ష వరకు ఉంటుందని కురుమే దేవన్న తెలిపారు దేవన్న తన యొక్క గొర్రెలు రెండు మేకలు విద్యుత్ తీగలకు అంటుకోగానే విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ అధికారులు వచ్చి ఆ యొక్క తీగలను తొలగించి గొర్రెలను పంచినామా చేయించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి దేవన్నకి నష్టపరిహారం అందిస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు.

## మంథనిలో ఘనంగా నూతన యజ్ఞోపవీత ధారణ

-వేదమంత్రోచ్చారణల మధ్య కార్యక్రమం నిర్వహించిన అవధానుల పురుషోత్తం శర్మ, కిషోర్ శర్మ



మంథని, ఆగస్టు 28 (తెలంగాణ పత్రిక):

మంథని పట్టణంలో నూతన యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు దేవాలయాల్లో సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు, యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాలు జరిగాయి. తమ్మి చెరువుకట్ట వీధిలోని శ్రీ హనుమాన్ దేవాలయంలో వేద పండితులు అవధానుల పురుషోత్తం శర్మ, కిషోర్ శర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమగుండాన్ని ఏర్పాటు చేసి వేదమంత్రోచ్చారణల మధ్య హోమం నిర్వహించారు. అనంతరం బ్రాహ్మణులకు సంప్రదాయ పద్ధతిలో నూతన యజ్ఞోపవీతాలను ధరింపజేశారు. యజ్ఞోపవీతానికి హిందూ సంప్రదాయంలో విశిష్టమైన ప్రాధాన్యత ఉందని పురుషోత్తం శర్మ, కిషోర్ శర్మ తెలిపారు. మూడు పోగులతో బ్రహ్మముడి వేసి రూపొందించే యజ్ఞోపవీతాన్ని ధార్మిక కార్యక్రమాల్లో పవిత్రంగా ఉపయోగిస్తారని వివరించారు. హిందూ సంప్రదాయంలో దారపు పోగులకు ప్రత్యేక స్థానం ఉందని, వ్రతాలు, తోరణాలు, మంగళసూత్రం వంటి శుభకార్యాల్లో కూడా వాటిని ఉపయోగిస్తారని పేర్కొన్నారు. ఇదే సందర్భంగా రక్షాబంధన్ పర్వదినాన్ని కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణులు, భక్తులు, పట్టణ ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడు మొక్కల సంరక్షణ బాధ్యత తీసుకోవాలి

-చెట్ల నరికివేతతో వాతావరణ సమతుల్యతకు ముప్పు

-రాంపూర్ సర్పంచి గోక మహిపాల్ రెడ్డి

నంగునూరు, ఆగస్టు 28(తెలంగాణ పత్రిక):

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి ప్రతి మొక్కను చెట్టుగా పెంచే బాధ్యతను ప్రతి పౌరుడు తీసుకోవాలని రాంపూర్ సర్పంచ్ గోక మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. చెట్లు, అడవులు ప్రకృతికి రక్షణ కవచంగా నిలుస్తాయని పేర్కొన్నారు. చెట్లను విచ్చలవిడిగా నరికివేత వల్ల వాతావరణ సమతుల్యత దెబ్బతింటోందని చెప్పారు. దీంతో కరవు, అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో మార్పులు వంటి సమస్యలు తీవ్రతరం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలంలోని రాంపూర్ లో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. వాటిని ఇంటి పరిసరాల్లో, ఖాళీ ప్రదేశాల్లో, పొలాల గట్ల వెంట నాటి సంరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వాలు, స్థానిక సంస్థలతో పాటు ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతగా స్వీకరించాలని అన్నారు. మొక్కను నాటి వదిలేయకుండా దానికి నీరు పోసి, అవసరమైన సంరక్షణ అందిస్తేనే అది భవిష్యత్తులో పెద్ద చెట్టుగా మారుతుందని చెప్పారు. చెట్టు నీడను అందించడంతో పాటు ఆక్సిజన్‌ను అందించడం, కార్బన్‌డయాక్సైడ్‌ను గ్రహించి నేల




కోతను నివారించి భూసారాన్ని పరిరక్షిస్తుందని తెలిపారు. పక్షులు, చిన్న జీవులకు ఆవాసం కల్పించి పర్యావరణ సమతుల్యతను కాపాడుతుందని వివరించారు.

**అభివృద్ధి--పర్యావరణం మధ్య సమతుల్యత అవసరం**

అభివృద్ధి పేరుతో పెద్దఎత్తున చెట్లను, అడవులను నరికివేయడం వల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందని మహిపాల్ రెడ్డి అన్నారు. అడవుల విస్తీర్ణం తగ్గడం, భూ వినియోగంలో మార్పులు, నీటి వనరులపై ఒత్తిడి, పెరుగుతున్న కాలుష్యం తదితర కారణాలు వాతావరణ మార్పులను మరింత తీవ్రతరం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఎల్ నినో వంటి వాతావరణ పరిణామాలు ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు, వర్షపాత నమూనాలపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

**భవిష్యత్ తరాల కోసం పచ్చదనం**

నేడు నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు అందించే విలువైన ఆస్తి అని సర్పంచి అన్నారు. గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, రహదారుల వెంట, చెరువుల పరిసరాల్లో, పొలాల గట్లపై స్థానిక వాతావరణానికి అనుకూలమైన మొక్కలను పెంచాలని సూచించారు. వన మహోత్సవం వంటి కార్యక్రమాలు కేవలం ఒకరోజు కార్యక్రమాలుగా మిగలకుండా "ఒక కుటుంబం--ఒక మొక్క, ఒక మొక్క--ఒక బాధ్యత" అనే స్ఫూర్తితో నిరంతర ఉద్యమంగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు నాంపల్లి వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎనగందుల నితిన్ కుమార్ క్షేత్ర సహాయకురాలు గోక అమావాస్య తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలకు మొక్కలను పంపిణీ చేసి, వాటి సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమం ద్వారా గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో బాధ్యతా భావాన్ని పెంపొందించేందుకు ప్రయత్నించారు. "మొక్క నాటడం మన చేతిలో ఉన్న చిన్న పని.. దాన్ని చెట్టుగా పెంచడం మన భవిష్యత్తు తరాల పట్ల ఉన్న పెద్ద బాధ్యత" అనే సందేశంతో రాంపూర్ వన మహోత్సవం పర్యావరణ పరిరక్షణకు ప్రజా భాగస్వామ్యాన్ని చాటింది.

# కల్వకుర్తిలో రెండు కిలోమీటర్ల పరుగును విజయవంతం చేయాలి

-అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు పిలుపు...

తెలంగాణ పత్రిక (కల్వకుర్తి ప్రతినిధి) 29 ఆగస్టు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా యువతలో అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించేందుకు ఆగస్టు 30న కల్వకుర్తిలో నిర్వహించనున్న రెండు కిలోమీటర్ల పరుగును విజయవంతం చేయాలని అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.నాగర్‌కర్నూల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పరుగు ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉదయం వాకింగ్ చేస్తున్న ప్రజలు, సాధన చేస్తున్న క్రీడాకారులు, ప్రభుత్వ అధికారులను కలిసి కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ఆయన ఆహ్వానించారు. యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పరుగును జయప్రదం చేయాలని కోరారు."మత్తు వాడితే కలలు కూలిపోతాయి.. మత్తు మానితే కలలు నిజమవుతాయి" అనే సందేశాన్ని



యువతలోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడంతో పాటు క్రీడలు, వ్యాయామం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.రెండు కిలోమీటర్ల పరుగు నిర్వహించే రహదారిని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశించారు.ఈ పరుగు ఆగస్టు 30వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు కల్వకుర్తి హైదరాబాద్ చౌరస్తా నుంచి ప్రారంభం కానుంది. 14 సంవత్సరాల లోపు బాలురు, బాలికలకు ప్రత్యేక విభాగం, 14 సంవత్సరాల పైబడిన వారికి ఓపెన్ విభాగం ఏర్పాటు చేశారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు పాల్గొనే ప్రతి ఒక్కరికీ పాల్గొన్న ధ్రువీకరణ పత్రం, బంగారు పతకం అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని భారత క్రీడా ప్రాధికార సంస్థ, భారత అథ్లెటిక్స్ సమాఖ్య, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ, తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం సహకారంతో నిర్వహిస్తున్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అంజయ్య, ప్రసాద్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్వకుర్తి శారీరక విద్యా దర్శకులు, సీనియర్ క్రీడాకారులు జిలకర శంకర్, నిరంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ, యూనిఫాం కుట్టు పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి

కామారెడ్డి ,ఆగస్ట్ 28, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లామాచారెడ్డి మండలం లచ్చాపేట గ్రామంలో ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్ విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు అందేలా కుట్టు పనులు పూర్తి చేయాలి మాచారెడ్డి మండలం లచ్చాపేట గ్రామంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్.వై. గిరి శుక్రవారం పరిశీలించారు. ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియలో భాగంగా అందుతున్న దరఖాస్తులు, ధృవపత్రాల పరిశీలన, సంబంధిత రికార్డులను పరిశీలించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు కొనసాగకుండా నిబంధనల



ప్రకారం పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. హియరింగ్‌కు హాజరయ్యే ఓటర్లకు అవసరమైన సమాచారం, సహకారం అందించాలని తెలిపారు. అనంతరం లచ్చాపేట గ్రామంలో విద్యార్థుల యూనిఫాం కుట్టు పనులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా యూనిఫాంలను నాణ్యతతో కుట్టాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్.వై. గిరి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి దశను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. యూనిఫాం కుట్టు పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూ, విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సరళ, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్ విక్టర్

-అర్హులైన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలి

కామారెడ్డి ,ఆగస్టు 28, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గ ఒపిట్లం మండలంలోని బొల్లక్‌పల్లి, మద్దెల చెరువు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, శుక్రవారం పరిశీలించారు. పిట్లం మండల తహసీల్దార్, పీడీసీ అధికారితో కలిసి ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన హియరింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించి, హియరింగ్ ప్రక్రియ నిర్వహణ తీరును పరిశీలించారు. నోటీసులు అందుకున్న ఓటర్ల నుంచి సమర్పిస్తున్న ధ్రువపత్రాలు, ఆధారాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ



సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. హియరింగ్‌కు హాజరయ్యే ఓటర్లకు అవసరమైన సమాచారం, మార్గదర్శకాలను అందించి, వారి అభ్యంతరాలు, వివరణలను నిబంధనల మేరకు నమోదు చేయాలని సూచించారు. హియరింగ్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ రవితేజ,పిట్లం మండల తహసీల్దార్, పీడీసీ అధికారి, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కి రాఖి కట్టిన సోదరి రామ నరేందర్ చౌదరి

కామారెడ్డి, ఆగస్టు 28, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



రాఖి పౌర్ణమిని పురస్కరించుకొని తన ఆత్మీయ సోదరి రామ నరేందర్ చౌదరి శుక్రవారం ఫిల్మ్ నగర్ లోని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ నివాసనికి వచ్చి రాఖి కట్టారు. గత మూడు దశబ్దలుగా రాఖి పౌర్ణమి రోజు రామ నరేందర్ చౌదరి షబ్బీర్ అలీ కి రాఖి కట్టి తమ మధ్య ఉన్న అన్న చెల్లెలి అనుబంధాన్ని పంచుకుంటారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ కుటుంబసభ్యులతో ఆత్మీయంగా మాట్లాడారు.

## అష్ట గ్రామపంచాయతీలో రాఖీ పండుగ



ముధోల్:28ఆగస్టు(తెలంగాణ పత్రిక)

మండలంలోని అష్ట గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రావుల లావణ్య, ఉప సర్పంచ్ సావిత్ర సురేఖ ఆధ్వర్యంలో రాఖీ పండుగ ను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. పంచాయతీ కార్యదర్శి గంగాధర్, పరిశుద్ధ కార్మికులకు రాఖీలను కట్టి స్వీట్లు, అరటి పండ్లను అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ..అన్నాచెల్లెళ్ల అనుబంధం, ప్రేమ, ఆప్యాయతలు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించారు. గ్రామంలో ప్రతి ఒక్కరు కలిసిమెలిసి సోదర భావంతో ఉండాలన్నారు. గ్రామాభివృద్ధిలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వినోద్, సురేఖ, చిన్నన్న, రాజేశ్వర్, మిద్దె సాయిలు, అనిల్, మీనాజ్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ క్రాప్ సర్వేలో పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

తానూర్:28ఆగస్టు(తెలంగాణ పత్రిక)



మండలంలోని ఝరి(బి) గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం రైతులకు డిజిటల్ క్రాప్ సర్వే, క్రాప్ బుకింగ్, ఫర్టిలైజర్ యాప్‌పై అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ అధికారి అంబాదాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పంటల వివరాలను డిజిటల్ క్రాప్ సర్వేలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సేవలు పొందేందుకు పంటల నమోదు కీలకమని తెలిపారు. యాప్‌ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయండి

-ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మేస్రం భాస్కర్
-బజరత్నూర్ ఇచ్చోడ మండలల సమితి




ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో ఆగస్టు 28 (తెలంగాణ పత్రిక)

దేశాన్ని పాలించే ప్రభుత్వాల ప్రధాన బాధ్యత ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ప్రతి యువకుడికి ఉపాధి, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికి అందుబాటు వైద్యం, రైతుకు గిట్టుబాటు ధర, కార్మికుడికి గౌరవప్రదమైన జీవనం, మహిళలకు భద్రత, ప్రజాస్వామ్య హక్కులకు రక్షణ కల్పించడమని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి మేస్రం భాస్కర్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లో వచ్చే నెల సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో జరగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభల గోడ పత్రాలు బజార్హత్నూర్ ఇచ్చోడ మండల కేంద్రంలలో విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ కార్యదర్శి మేస్రం భాస్కర్‌లి. మాట్లాడుతూ దేశ అభివృద్ధి అంటే కొద్దిమంది సంపద పెరగడం కాదని, ప్రజలందరికీ సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, లౌకికత, రాజ్యాంగ విలువలు, శాస్త్రీయ దృక్పథం బలపడటమే నిజమైన అభివృద్ధి అని వారు ఉద్ఘటించారు. ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించిన ప్రభుత్వ రంగాన్ని కాపాడడం, ఖాళీ ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయలని , ఆదిలాబాద్ జిల్లా లో యూనివర్సిటీ ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు,ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు, పెందూర్ ప్రకాష్, నాయకులు సాయి తేజ, హేమ, సురేఖ, సుజాత, లావణ్య ఉత్తం, శంకర్, ప్రవీణ్,రమేష్, తదితరులు పాల్గొన్నారు,

## ముధోల్ లో ఘనంగా రక్షాబంధన్



ముధోల్:28ఆగస్టు(తెలంగాణ పత్రిక)

మండలకేంద్రమైన ముధోల్ తో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య గల అనుబంధానికి తరతరాలుగా రక్షాబంధన్ పర్వదినం నిదర్శనంగా నిలుస్తోంది. ఈ పండుగ పూట తమ సోదరుల చేతులకు రాఖీలను కట్టి వారి క్షేమాభివృద్ధిని అక్కా చెల్లెళ్లు కోరుకుంటారు.ఈ రాఖీ వారి ప్రేమానుబంధానికి సూచన.ఈ సందర్భంగా తమ అక్క చెలేళ్లకు అన్నలూ,తమ్ముళ్లూ బహుమతు లను అందించి ఆశీర్వాదం పొందారు.గ్రామాల్లో ఎక్కడ చూసినా రక్షాబంధన్ పండుగ వేడుకల సందడి కనిపించింది. ప్రధాన కూడళ్లలో రాఖీల అమ్మకాల స్టాళ్లు వెలిశాయి అదే విధంగా స్వీట్ల దుకాణాల్లో కిటకిటలాడాయి.

## నేడు దోమకొండకు షబ్బీర్ అలీ రాక

కామారెడ్డి ,ఆగస్టు 28, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాదోమకొండ మండల కేంద్రంలో గల ప్రాథమికవ్యవసాయ సహకార సంఘం చైర్మన్ పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు శివరాం మందిర్ రోడ్డులో గల రెడ్డి సంఘం లో జరుగుతుందని మండల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. వ్యవసాయ సహకార సంఘ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ హాజరవుతారని వారు తెలిపారు.సొసైటీ పరిధిలో గల ఆరు గ్రామాల రైతులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు సకాలంలో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సీతారాం మధు కోరారు.

## వాళ్ల హరీశ్‌రావు ఆధ్వర్యంలో ఆత్మీయ కలయిక.. శ్యామ్ శివకు మాజీ మంత్రి హరీశ్‌రావు శుభాకాంక్షలు



రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆగస్టు 28 : ( తెలంగాణ పత్రిక )

శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నేత శ్యామ్ శివ జన్మదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు వాళ్ల హరీశ్‌రావు ఆధ్వర్యంలో నాయకులు మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్యామ్ శివ, బాబు మోహన్, మల్లేష్, రామకృష్ణ, మమత తదితరులు హరీశ్‌రావును కలిసి జన్మదిన వేడుకలకు ఆహ్వానించారు. వారిని ఆత్మీయంగా ఆహ్వానించిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, శ్యామ్ శివను శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్యామ్ శివకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, భవిష్యత్తులో మరింతగా ప్రజలకు సేవ చేయాలని హరీశ్‌రావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

## దోమకొండ లోఘనంగా నూలు పున్నమి ఉత్సవాలు

కామారెడ్డి ,ఆగస్ట్ 28,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని అన్ని మండలాలు గ్రామాలలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. దోమకొండ మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నూలు పున్నమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం మార్కండేయ సమేత ఉమామహేశ్వర లకు కుంబాభిషేకం గణపతి పూజ స్వస్తి పుణ్యవచనం అఖండ దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు .అనంతరం యజ్ఞోపవీతరణ పూర్ణాహుతి కార్యక్రమాలను జరిపారు సాయంత్రం మార్కండేయ స్వామి ఉమామహేశ్వర్ల ఊరేగింపు కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఐరేని నరసయ్య, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు అందే గణేష్, పట్టణ అధ్యక్షుడు మేక నాగరాజ్, ప్రధాన కార్యదర్శి బొమ్మెర గంగాధర్, క్యాషియర్ గణేష్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు బత్తిని సిద్ధ రాములు, ఉప సర్పంచ్ బొమ్మెర శ్రీనివాస్, వార్డు సభ్యులు పాలకుర్తి శేఖర్, బీసు సతీష్, ఐరేని రాజేందర్ లత, సంఘం ప్రతినిధులు సిరిమల్లె రాజు, అవధూత సహదేవ్, అందే నాగభూషణం, సుంచు రాములు, తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

-అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందజేత!
-జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు



కామారెడ్డి ,ఆగస్ట్ 28, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాజుక్కల్ నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతారావు చేతుల మీదుగా నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి నేరుగా చేరాలనే లక్ష్యంతో అర్హులైన వారికి సుమారు 87 వేల స్మార్ట్ రేషన్ కార్డులను అందించడం జరిగింది. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే మా మొదటి ప్రాధాన్యత. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి రాఖీ కట్టిన అడువాల జ్యోతి



జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) ఆగస్టు 28

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి చెల్లెలిగా రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఆనందంగా జరుపుకున్నారు.శ్రావణ మాసం మూడవ శుక్రవారం సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయంలో అడువాల జ్యోతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ సందర్భంగా అడువాల జ్యోతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, సౌభాగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, సంతోషం నెలకొనాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని కోరుకున్నారు.

## సర్పంచ్‌కు రాఖీ కట్టిన మహిళా వార్డు సభ్యులు



తెలంగాణ పత్రిక, శంకరపట్నం :ఆగస్టు 28

మొలంగూర్: రాఖీ పండుగ సందర్భంగా మొలంగూర్ గ్రామ సర్పంచ్ పూదరి రాజుకు మహిళా వార్డు సభ్యులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్‌కు రాఖీ కట్టి అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ఆత్మీయంగా జరుపుకున్నారు. మహిళా వార్డు సభ్యులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం సర్పంచ్ పూదరి రాజు మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించారు. గ్రామంలో ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు అన్ని వర్గాలను కలుపుకొని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. సర్పంచ్ పూదరి రాజు మహిళా వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో మహిళా సభ్యుల సహకారం, సూచనలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. అందరి సహకారంతో మొలంగూర్ గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నంగునూరు మండలంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**-అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా పండుగ**

**-భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు**

**నంగునూరు, ఆగస్టు 28(తెలంగాణ పత్రిక):**

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పర్వదినాన్ని సిద్దిపేట జిల్లా నంగునూరు మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు. మండలంలోని నంగునూరు, గట్ల మల్యాల, నర్మెట, సిద్ధన్నపేట, మగ్ధుంపూర్, పాలమాకుల, బద్దిపడగ, రాజగోపాలపేట, ముండ్రాయి, వెంకటాపూర్, కోనాయిపల్లి, తిమ్మాయిపల్లి, ఖానాపూర్, అక్కెనపల్లి, అంక్షాపూర్, రాంపూర్, నాగరాజుపల్లి, ఘనపురం, ఖాతా, కొండంరాజుపల్లి, దర్గపల్లి, మైసంపల్లి, జేపీ తండా, అప్పలాయిచెరువు, రామచంద్రాపురం, రాంనగర్, సంతోష్‌నగర్ తదితర గ్రామాల్లో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి.

**అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక**

ఉదయం నుంచే ఇళ్లలో పండుగ సందడి కనిపించింది. సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి, తిలకం దిద్ది, మిఠాయిలు తినిపించి వారి క్షేమాన్ని ఆకాంక్షించారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు ప్రేమాభిమానాలతో కానుకలు అందించి, జీవితాంతం వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దీంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా కుటుంబ బంధాలు, ఆత్మీయతలు వెల్లివిరిశాయి.

**ఆలయాల్లో ప్రత్యేక పూజలు**

రక్షాబంధన్ సందర్భంగా మండలంలోని ప్రముఖ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కోనాయిపల్లి వెంకటేశ్వరాలయం,



ఖాతా మహదేవుని ఆలయం, బద్దిపడగ రాజరాజేశ్వరస్వామి ఆలయం, నర్మెటలోని ప్రాచీన శివాలయం భక్తులతో సందడిగా కనిపించాయి. ముండ్రాయి, మైసంపల్లి గ్రామాల్లోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.

**నంగునూరు ఆలయాల్లో భక్తుల సందడి**

మండల కేంద్రం నంగునూరులోని ప్రముఖ ఆలయాలు కూడా భక్తులతో సందడిగా మారాయి. తోకలగుట్టపై వెలసిన రామాలయం, వెంకటేశ్వర ఆలయం, అభయాంజనేయ ఆలయం, నాగమానస దేవి ఆలయం వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనానికి తరలి వచ్చారు. నంగునూరులో నల్ల పోచమ్మ తల్లి దేవాలయం, శివాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని, స్వామివారిని దర్శించుకుని కుటుంబ సభ్యుల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థించారు.

**ప్రత్యేక ఆకర్షణగా ప్రాచీన ఆలయాలు**

సిద్ధన్నపేట, నర్మెటలోని పాటి మీది ఆంజనేయ స్వామి దేవాలయాలు, పాలమాకులలోని వెంకటేశ్వర ఆలయం, ప్రాచీన శంభుదేవుని ఆలయం, సిద్ధన్నపేటలోని సిద్దేశ్వరాలయం వద్ద కూడా భక్తుల రద్దీ నెలకొంది. ప్రాచీన ఆలయాల వద్ద పూజలు



నిర్వహించడంతో పాటు కుటుంబ సభ్యులతో కలిసి భక్తులు ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు.

**పల్లెల్లో పండుగ వాతావరణం**

నంగునూరు మండలంలోని గ్రామాల్లో రక్షాబంధన్ సందర్భంగా ప్రత్యేకమైన పండుగ వాతావరణం నెలకొంది. ఇళ్ల ముందు ముగ్గులు, పూజా కార్యక్రమాలు, రాఖీలతో అలంకరించిన సోదరుల చేతులు, సోదరీమణుల సందడి గ్రామీణ జీవనంలోని ఆత్మీయతను ప్రతిబింబించాయి. నాగరాజుపల్లి, ఘనపురం, మైసంపల్లి, కొండంరాజుపల్లి, దర్గపల్లి, ఖాతా, జేపీ తండా, అప్పలాయి చెరువు, రాంనగర్, రామచంద్రాపురం, సంతోష్ నగర్ తదితర గ్రామాల్లోనూ ప్రజలు రక్షాబంధన్‌ను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

**బంధాలకు బలం చేకూర్చే పండుగ**

రక్షాబంధన్ కేవలం రాఖీ కట్టే పండుగ మాత్రమే కాకుండా కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే సామాజిక, సాంస్కృతిక వేడుకగా నిలుస్తోంది. మారుతున్న జీవనశైలిలో కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలను గుర్తుచేస్తూ, ప్రేమ, బాధ్యత, పరస్పర నమ్మకం, ఆప్యాయతల విలువను చాటిచెప్పే పర్వదినంగా రక్షాబంధన్‌కు ప్రత్యేక స్థానం ఉంది. నంగునూరు మండలంలోని పల్లెల్లో జరిగిన వేడుకలు 'బంధమే బలం.. ఆప్యాయతే ఆనందం' అనే సందేశాన్ని చాటిచెప్పాయి.

# పుసుకుంట చెక్‌పోస్ట్ వద్ద అక్రమ ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

**తెలంగాణ పత్రిక దమ్మపేట ఆగస్టు 28**

దమ్మపేట: పాల్వంచ అటవీ డివిజన్ పరిధిలోని దమ్మపేట అటవీ రేంజ్‌లో అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు అటవీ శాఖ అధికారులు చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు: 27.08.2026 తేదీన రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో పుసుకుంట చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను అటవీ సిబ్బంది అడ్డుకుని పరిశీలించారు. రవాణాకు సంబంధించి ఎలాంటి చెల్లుబాటు అయ్యే అనుమతులు లేదా పత్రాలు లేకపోవడంతో, ఇసుక లోడుతో సహా ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని తమ




ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ అక్రమ రవాణాపై చట్ట ప్రకారం కేసు నమోదు చేసి, తదుపరి విచారణ మరియు చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. దమ్మపేట అటవీ డివిజన్ పరిధిలో అటవీ, సహజ వనరుల అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్ట్‌ల వద్ద నిరంతరం వాహన తనిఖీలు కొనసాగిస్తామని, అనుమానాస్పద ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రజలకు విజ్ఞప్తి: అనుమతులు లేకుండా ఇసుకను లేదా అటవీ ప్రాంతాల నుంచి సహజ వనరులను తరలించడం చట్టవిరుద్ధమైన చర్య అని, ఎవరూ ఇటువంటి అక్రమ రవాణాకు పాల్పడవద్దని దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కే.శ్రీను విజ్ఞప్తి చేశారు. అక్రమ ఇసుక లేదా అటవీ వనరుల తరలింపుపై సమాచారం తెలిస్తే వెంటనే సమీప అటవీ శాఖ అధికారులకు అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అటవీ సంపద పరిరక్షణలో ప్రజల సహకారం చాలా అవసరమని కోరారు.

# భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం.. సర్పంచ్‌కు వాయనం అందించిన రాజేశ్వరి

**దమ్మపేట, ఆగస్టు 28 (తెలంగాణ పత్రిక)**

వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ప్రజా ప్రెస్ క్లబ్ కోశాధికారిణి, నీలం వార్త పాత్రికేయురాలు నీలం రాజేశ్వరి శుక్రవారం తన నివాసంలో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుటుంబ సభ్యుల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు సమృద్ధిగా ఉండాలని ప్రార్థించారు. పూజా కార్యక్రమం అనంతరం స్థానిక సర్పంచ్ పగడాల రమాదేవికి సంప్రదాయబద్ధంగా వాయనం



అందించారు. వరలక్ష్మీ అమ్మవారి కృపతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఈ సందర్భంగా రాజేశ్వరి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ వరలక్ష్మీ వ్రతం మహిళలకు అత్యంత పవిత్రమైన పండుగ అని, కుటుంబ సంక్షేమం, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించినట్లు తెలిపారు. పూజా కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, మహిళలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# గంభీరావుపేటలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**-రాఖీ కట్టిన చెల్లి.. ప్రేమతో మురిసిన అన్నయ్య**

**గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఆగస్టు 28**

అన్నా చెల్లెళ్ల ప్రతీకకు అనుబంధంగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను గంభీరావుపేట మండల వ్యాప్తంగా ప్రజలు శుక్రవారం రోజున ఘనంగా జరుపుకున్నారు సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టేందుకు పుట్టింటికి బయలుదేరి వెళ్లారు రాఖీ కట్టి మిఠాయిలు తినిపించిన అక్క చెల్లెళ్లకు సోదరులు తమకు తోచిన విధంగా కట్న కానుకలు సమర్పించి ఆశీర్వాదం తీసుకొని ప్రేమను చాటుకున్నారు.అలాగే



చదువుల నిమిత్తం వివిధ ప్రాంతాలలో హాస్టలల్లో ఉంటున్న చెల్లెలు అన్నయ్యలుకు రాఖీ కట్టేందుకు సొంత ఊరికి వచ్చి సోదర బంధాన్ని చాటుకున్నారు. దూర ప్రాంతాల నుంచి సోదరీమణులు రావడంతో



మండలంలో సందడి వాతావరణం నెలకొంది. స్వీట్ హౌస్ లు, రాఖీ సెంటర్లు కళకళలాడాయి

# ఏఐటీయూసీ రాష్ట్ర 4వ మహాసభల గోడపత్రిక విడుదల



**రాజేంద్రనగర్ ప్రతినిధి ఆగస్టు 28,తెలంగాణ పత్రిక.**

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సెప్టెంబర్ 6.7.8 తేదీలలో కరీంనగర్ పట్టణంలో జరిగే తెలంగాణ రాష్ట్ర ఏఐటియుసి మహాసభల వాల్ పోస్టర్ ను విడుదల చేశారు.కార్యక్రమంలో భవన నిర్మాణ అదర్ కన్స్ట్రక్షన్ సంగం రాష్ట్ర నాయకులు సిపిఐ పార్టీ మండల కార్యదర్శి నర్రగిరి పాల్గొన్నారు. శంషాబాద్ మండల ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి గిలక రాజు, మండల అధ్యక్షులు శ్రీను, భావన నిర్మాణ ఆధర్ కన్స్ట్రక్షన్ సంగం మండల అధ్యక్షుడు ఎద్దుల శ్రీను, మండల ఉపాధ్యక్షులు దండు రవి మరియు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్ర గిరి మాట్లాడుతూ కరీంనగర్లో జరిగే రాష్ట్ర నాలుగో మహాసభలకు శంషాబాద్ మండల కేంద్రం నుండి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

# అన్నా హెల్మెట్ ధరించండి

**-రాఖీ కట్టి పోలీసుల వినూత్న ప్రయత్నం**



**కామారెడ్డి, ఆగస్టు 28, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

రాఖీ పండుగ సందర్భాన్ని రోడ్డు భద్రతా అవగాహనకు వేదికగా మలుచుకుని కామారెడ్డి ట్రాఫిక్ పోలీసులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జరిమానాలతో భయపెట్టడం కంటే ఆత్మీయతతో మార్పు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కామారెడ్డి డీఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ సీఐ నరహరి ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్సై చంద్రశేఖర్ గౌడ్ నేతృత్వంలో పోలీస్ స్టేషన్ ఎదుట ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెల్మెట్ లేకుండా వచ్చిన ద్విచక్ర వాహనదారులను ఆపి, మహిళా ట్రాఫిక్ సిబ్బంది వారికి బొట్టు పెట్టి రాఖీ కట్టారు. 'అన్నా ప్లీజ్.. మీ ప్రాణం మీ కుటుంబానికి ఎంతో విలువైనది, క్షేమంగా ఇంటికి చేరడం కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించండి' అంటూ సూచించారు. చట్ట ప్రకారం చలానా విధిస్తూనే, మానవతా దృక్పథంతో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన తీరు వాహనదారులను ఆకట్టుకుంది. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పోలీసులు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై వినయ్ సాగర్తో పాటు మహిళా సిబ్బంది శోభ, స్వప్న, అనిత, సిబ్బంది మూసిన్ ఖాన్, తిరుపతి, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడికి ఘన సన్మానం



**ఓదెల ఆగస్ట్ 28 తెలంగాణ పత్రిక**

ఓదెల మండలం మడక గ్రామంలో నూతనంగా ఎమ్మార్పీఎస్ ఓదెల మండల అధ్యక్షుడిగా ఎన్నికైన గోషిక స్వామిని శాలువాతో సన్మానం చేసిన నాయకులు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్, మ్యాడగోని శ్రీనివాస్ గౌడ్, గిద్దమారి రమేష్,తుడి సంపత్,పేరవేన సతీష్, మ్యాడగొని రాజు,ఎలుకపల్లి దుర్గయ్య,రాజోజుల సత్యం,మ్యాకల లక్ష్మయ్య, లింగయ్య,లక్ష్మయ్య,అసంపల్లి సురేందర్, గూడెల్లి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు

# ఆరంభ చైల్డ్ డెవలప్మెంట్ థెరపీ క్లినిక్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

-మాటలురాని, చిన్నపిల్లలకు థెరపీ క్లినిక్ ఉపయోగకరం

మిర్యాలగూడ ప్రతినిధి// ఆగస్టు 28:(తెలంగాణ పత్రిక):-

మాటలురాని, చిన్న పిల్లలకు మానసికంగా విద్యలో వెనుకబడిన పిల్లలకు థెరపీ క్లినిక్ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందనిమిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలో 25వ వార్డు సంతోష్ నగర్ లో సిద్ధ వీర రాఘవేంద్రరావు, రమేష్, రాచమల్ల వైష్ణవి, రాచమల్ల సాయిపవన్, రాచమల్ల వీరయ్య, సుస్మిత ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆరంభ చైల్డ్ డెవలప్మెంట్ థెరపీ క్లినిక్ ను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నపిల్లలు మానసిక వికలాంగులు మాటలు రానివారు, దివ్యాంగులు కు ఈ తెరపి ద్వారా నయం చేయవచ్చున న్నారు. ఈ మధ్యకాలంలో చిన్న పిల్లలు సెల్ ఫోన్ కు అలవాటై



మాటలు రాక ఇబ్బంది పడుతున్న వారికి ఈ ఆరంభ క్లినిక్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, జిల్లా నాయకులు గుడిపాటి నవీన్ కుమార్, స్థానిక 25 వార్డ్ కౌన్సిలర్ మనోజ్ నాయక్, టూ టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, 32 వ వార్డు కౌన్సిలర్ ఎండి హామీదుద్దీన్(మోయిజ్) మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్



ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి (రాంబో) సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ సీతారాముల నాయక్, కోటి, ఆలగడప గిరిధర్, బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ్ నాయక్, ప్రతాప్ నాయక్, గోదాల జానకి రామ్ రెడ్డి, నాయి బ్రాహ్మణ పట్టణ అధ్యక్షుడు నర్సింహ, వీరయ్య, పందిరి వేణు, వెంకట్, స్పెషల్ ఎడ్యుకేటర్ బత్తుల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సరస్వతి కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు







-ఆర్ఎస్ఎస్ కార్యకర్తల ఆధ్వర్యంలో విద్యార్థులకు రాఖీలు

బొంరాస్‌పేట్ (తెలంగాణ పత్రిక) :

బొంరాస్‌పేట్‌లోని శ్రీ సరస్వతి కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో బొంరాస్‌పేట్ ఆర్ఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ప్రధానంగా పాల్గొని విద్యార్థులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు, సిబ్బంది కూడా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు మాట్లాడుతూ.. రక్షాబంధన్ పండుగ సోదరభావం, పరస్పర ప్రేమ, ఆత్మీయత, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ పరస్పరం సహకరించుకుంటూ ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. యువతలో దేశభక్తి, సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీ సరస్వతి కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ కె. సుధాకర్ మాట్లాడుతూ.. రక్షాబంధన్ పండుగ మన సంప్రదాయాలు, సోదరభావాన్ని చాటిచెప్పే గొప్ప పండుగ అని అన్నారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఇన్‌స్టిట్యూట్‌లో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయ మన్నారు. విద్యార్థులు విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, మానవతా విలువలను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు విద్యార్థులకు రాఖీలు కట్టి, రక్షాబంధన్ పండుగ విశిష్టతను వివరించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం పరస్పరం రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

# ప్రభుత్వ విధానాలపై మరో పోరాటం సిద్ధం కావాలి జూలకంటి

-సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ ప్రతినిధి//ఆగస్టు 28:(తెలంగాణ పత్రిక):-

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సమస్యలపై జరుపుతున్న నిర్లక్ష్యాన్ని రైతులకు వ్యతిరేకంగా జరుపుతున్న విధానాలపై మరొక పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో 2000 సంవత్సరంలో హైదరాబాదులోని బషీర్బాగ్ వద్ద నాటి ప్రభుత్వం తీసుకున్న విద్యుత్ సంస్కరణలు వ్యతిరేకిస్తూ జరిగిన పోరాటాలు అమర్త్రైన విష్ణువర్ధన్ రెడ్డి రామకృష్ణ బాలస్వామి ల కు వామపక్షాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూలకంటి



మాట్లాడుతూ నాటి టిడిపి ప్రభుత్వం కొత్తగా విద్యుత్ సంస్థలను చేపట్టగా దాన్ని వ్యతిరేకిస్తూ ఆనాడు హీరోచిత పోరాటం జరిగిందని ఆ పోరాటంలో ముగ్గురు అమలు చేయాలని గుర్తు చేశారు. ఆనాడు విద్యుత్ సంస్థల పేరుతో వ్యవసాయానికి మీటర్లు పెట్టాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకించామని నేడు కూడా విద్యుత్ తరంగంలో అనేక మార్పులు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని దీనికి మరో పోరాటం జరగాల్సిందని వారు తెలిపారు. నేటి కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని తమ గుప్పట్లో పెట్టుకొని ఏకపక్షంగా నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు ప్రజలకు ఇచ్చే రాయితీలను ఇవ్వకుండా కార్పొరేట్ శక్తులకు విదేశీ స్వదేశీ కంపెనీలకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నాయని దీని వ్యతిరేకించాలని ఆయన కోరారు. నాటి పోరాటంలో అమరులైన వారికి సిపిఎం నాయకులు మల్లేష్ వెంకటేశ్వర్లు రవి నాయక్ మంగారెడ్డి పరశురాములు రామ్మూర్తి కోడి రెక్క మల్లయ్య రెడ్డి దేశి రాం రామారావు ల్యాబ్ సంఘం నాయకులు శ్రీను బుడిగ సైదులు సిపిఐ జిల్లా నాయకులు బంటు వెంకటేశ్వర్లు ఎం సిపిఐ నాయకులు వస్కుల మట్టయ్య పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

-బాలికల రక్షణ, విద్య, సాధికారతకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి.

-కలెక్టర్ అంకిత్.

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక ఆగష్టు 28

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్డ్రన్ హోమ్ బాలికలు జిల్లా కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ (రెవెన్యూ), అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), జిల్లా సంక్షేమాధికారి కి ఇతర అధికారులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు బాలికలతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి విద్య, భవిష్యత్ లక్ష్యాలు, అభిరుచుల గురించి తెలుసుకున్నారు. బాలికలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడంతో పాటు పుస్తకాలు, పెన్నులు, స్వీట్స్ తదితర బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాలికలు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజానికి, దేశానికి విలువైన సంపద అని





అన్నారు. ప్రతి బాలికకు సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు, నాణ్యమైన విద్యను అందించి, వారు తమ కలలను సాకారం చేసుకునేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. "బేటీ బచావో -- బేటీ పడావో" స్ఫూర్తితో బాలికల రక్షణ, విద్య, ఆరోగ్యం, సాధికారతకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. బాలికలు ధైర్యంగా ముందుకు సాగి, ఉన్నత విద్యను అభ్యసించి, తమకు నచ్చిన రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. "బాలికను కాపాడుదాం -- బాలికను చదివిద్దాం -- బాలిక ఎదుగుదలకు తోడ్పడదాం" అనే సందేశంతో



సమాజంలోని ప్రతి ఒక్కరూ బాలికల భద్రత, విద్య, భవిష్యత్తు కోసం బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. రక్షాబంధన్ సందర్భంగా చిల్డ్రన్ హోమ్ బాలికలు అధికారులు, ప్రజాప్రతినిధులు, సమాజంలోని ప్రతి ఒక్కరి నుంచి తమకు అండగా ఉంటుందనే భరోసాను పొందారు. ఈ కార్యక్రమం బాలికల్లో ఆత్మవిశ్వాసం, భద్రతా భావం, కుటుంబ అనుబంధం పెంపొందించేలా ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమం లో హబ్ మిషన్ కోఆర్డినేటర్ సంతోష రూప , స్వాతి , ప్రియాంక , మౌనిక , దీప్తి , చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వినోద్ బాలికలు పాల్గొన్నారు

# ఘనంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ జన్మదిన వేడుకలు



ముధోల్: 28ఆగస్టు(తెలంగాణ పత్రిక)

ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు మండల కేంద్రమైన ముధోల్ లో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని భగవంతుని కోరుకున్నారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ హయాంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు కార్యకర్తలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటివార్ రమేష్, మోహన్ యాదవ్, వరగంటి జీవన్, సాయినాథ్, విట్టల్, ఆస్పత్రి పర్యవేక్షకులు సందీప్ రావు, భుజంగ్ నాగేష్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# అనురాగానికి ప్రతీక రాఖీ

-ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



పాపన్నపేట, ఆగస్టు 28 (తెలంగాణ పత్రిక) :



పాపన్నపేట మండల వ్యాప్తంగా రాఖీ పౌర్ణమి వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా,ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగాయి. అక్కా చెల్లెలు,అన్నదమ్ముల మధ్య ఉన్న ప్రేమానురాగాలకు అద్దంపట్టేలా ఈ వేడుకలు సాగాయి. ఉదయాన్నే మహిళాలు పవిత్ర స్నానాలు ఆచరించి పూజా కార్యక్రమాలు పూర్తి చేశారు. అనంతరం తమ సోదరులకు హారతి ఇచ్చి,తిలకం దిద్ది,దీర్ఘాయుష్షు కలగాలని కోరుకుంటూ చేతికి రంగు రంగుల రాఖీలను కట్టారు. తమకు ఎల్లవేళలా రక్షణగా ఉండాలని ఆకాంక్షించారు. సోదరులు తమ అక్కా చెల్లెళ్లకు పాదాభివందనం చేసి ప్రత్యేక కానుకలు అందించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

# డివైడర్ పై ఉన్న పూల కుండీని ఢీకొన్న బైకు

-ప్రమాదంలో బైకు నడిపిన వ్యక్తి మృతి.

రాజేంద్రనగర్ ప్రతినిధి, ఆగస్టు 28 తెలంగాణ పత్రిక.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నాడు చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం సయ్యద్ సమద్ తన రోజువారి పనిలో భాగంగా నార్సింగి ఫస్ట్ క్లబ్ గ్రోసరీ స్టోర్ కు వెళ్ళాడు. గ్రోసరీ సరుకులను డెలివరీ చేయడానికి బైక్ పై వెళుతుండగా నార్సింగి నుండి గండిపేట వైపు వెళుతుండగ నార్సింగి బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదానికి గురైనట్లు తెలిపారు. రోడ్డు డివైడర్ పై ఉన్న చెట్టు కుండి ని ఢీకొట్టగా అదే సమయంలో గండిపేట నుండి నర్సింగి వైపు వస్తున్న టాటా కారు సయ్యద్ సమద్ ను ఢీ కొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు సమాచారాన్ని అందుకొని అక్కడికి చేరుకొని సయ్యద్ సమద్ ను లంగర్ హౌస్ లోని లెనోవా హాస్పిటల్కు తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే సయ్యద్ సమద్ మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని ప్రమాదానికి గల కారణాలను సి సి టీవీ ఫుటేజ్, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను అందుబాటులో ఉన్న ఆధారాలను సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆశలకు కనీస వేతనాలు ఇవ్వాలి

-ఆశ వర్కర్స్ నల్గొండ జిల్లా నాయకురాలు చెరుకు జానకి



కట్టంగూర్, ఆగస్టు 28: గ్రామస్థాయిలో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్ల సేవలను ప్రభుత్వం గుర్తించి కనీస వేతనంగా రూ .26000 చెల్లించాలి. సెలవు దినాల్లోనూ వైద్య సేవలు అందిస్తున్న తమపై రోజురోజుకు పని భారం అధికమవుతుంది. టీ ఏ, డి ఎ సదుపాయం కల్పించడంతోపాటు ప్రమాద బీమాను కూడా వర్తింపజేయాలి. పథకాలన్నింటిలో కీలకపాత్ర పోషిస్తున్న ఆశలను ఉద్యోగ భద్రత కల్పించాలి.

# రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్ల తొలగింపు



కట్టంగూర్, ఆగస్టు 28: మండలంలోని కలిమెర గ్రామం నుంచి సత్యనారాయణపురం వెళ్లే మార్గంలో చెట్ల కొమ్మలు రహదారికి అడ్డుగా ఉండటంతో రైతులు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు కలుగుతు ండటంతో ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ తోటకూరి జలజ యాదయ్య దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పంది ంచిన సర్పంచ్ చొర వ తీసుకుని చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే ముత్యాలమ్మ తల్లి చెరువు కట్ట సమీపంలో చెట్ల కొమ్మలు ఉండటం వల్ల త్వరలో జరిగే బోనాల కార్యక్రమానికి కూడా అంతరాయం కలిగే అవకాశం ఉండటంతో వాటిని సైతం తొలగించారు. దీంతో సాఫీగా ప్రయాణం సాగనుంది .ఈ కార్యక్రమం సర్పంచ్ తోటకూరి జలజ యాదయ్య తోపాటు ఉప సర్పంచ్ ఖమ్మంపాటి లింగమ్మ యాదయ్యగౌడ్ల ఆధ్వర్యంలో వార్డు సభ్యుల సహకారంతో కొనసాగింది.

## దళితులపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి: కేవిపిఎస్



కట్టంగూర్, ఆగస్టు 28: మండలంలోని మునుకుంట్ల గ్రామంలోని మారెమ్మ దేవాల యంలో బోనాలు సమర్పించేం దుకు వెళ్లిన దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవిపిఎస్) శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, నాయకులు శిలుముల రామస్వామి మాట్లాడుతూ ఉపసర్పంచ్ మల్లేష్‌తో పాటు దాడిలో పాల్గొన్న నిందితులందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలన్నారు. సమాజంలో నేటికీ దళితులపై కుల వివక్ష చూపడం, ఆలయ ప్రవేశాన్ని అడ్డుకుని దాడికి పాల్పడటం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. నల్గొండ జిల్లా ఎస్పీ జోక్యం చేసుకుని బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించాలని, నిందితులను వెంటనే అరెస్ట్ చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

-డీటీ కి రాఖీ కట్టిన తహసిల్దార్



కట్టంగూర్, ఆగస్టు 28: సోదర ప్రేమకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను శుక్రవారం మండల వ్యాప్తంగా ఆనందోత్సాహాలు, ప్రేమానురాగాలతో ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన కట్టంగూర్ తో పాటు అన్ని గ్రామాలలో మహిళల కోలాహలం కనిపించింది. వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆడపడుచులు తమ సోదరులకు రాఖీలు కట్టేందుకు ఆప్యాయతతో వచ్చి అనురాగాన్ని పంచుకున్నారు. దీంతో మండల వ్యాప్తంగా ఈ గ్రామం చూసిన రహదారులు వాహనాలు, మహిళల రద్దీతో దర్శనమిచ్చాయి. శ్రావణ మాస పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంధ్యాల పౌర్ణమి సందర్భంగా పలువురు నూతన యజ్ఞోపవీతాలను ధరించారు. మహిళలు తమ సోదరుల గృహాలకు చేరుకొని రక్షాబంధనం కట్టి తమ తోబుట్టువులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించి మంగళ హారతులు అందించి దీవించారు. ప్రేమతో తరలివచ్చిన ఆడపడుచులకు రాఖీ కట్టిన అనంతరం చీర సరే కానుకలు అందించారు. రాఖీ పండుగ సందర్భంగా మండల కేంద్రంలో సుమారు పాతిక వరకు రాఖీల విక్రయ దుకాణాలు వెలిశాయి. అదేవిధంగా మిఠాయి దుకాణాలు కూడా మహి ళలతో రద్దీగా కనిపించాయి. మండల తహశీల్దార్ కార్యాలయంలో రక్షాబం ధన్ పర్వదిన వేడుకలు ఆత్మీయ వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భ ంగా కట్టంగూర్ మండల తహసిల్దార్ ఏ. పుష్పలత, డిప్యూటీ తహశీల్దార్ ఫ్రాంక్లిన్ ఆల్బర్ట్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నకిరేకల్లోని క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ స్థానిక శాసనసభ్యులు వేముల వీరేశంకు తాసిల్దార్ రాఖీ కట్టి మిఠాయి తినిపించారు.

# బషీర్‌బాగ్ అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ సంస్కరణలను అడ్డుకోవాలి: సీఐటీయూ



తెలంగాణ పత్రిక దమ్మపేట, ఆగస్టు 28
26 ఏళ్ల క్రితం చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ చార్జీలను భారీగా పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపినప్పుడు, కమ్యూనిస్టు పార్టీల పిలుపుతో అఖిలపక్షాల ఆధ్వర్యంలో ప్రజలు పెద్ద ఎత్తున పోరాటం చేశారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ అన్నారు. ఆ పోరాటంలో బషీర్‌బాగ్‌లో పోలీసుల కాల్పుల్లో రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి, బషీర్ తదితరులు ప్రాణాలు కోల్పోయారని, వారి త్యాగాల స్ఫూర్తితోనే పాలకులు విద్యుత్ చార్జీల పెంపుపై వెనకడుగు వేస్తున్నారని పేర్కొన్నారు. శుక్రవారం దమ్మపేటలోని సీఐటీయూ కార్యాలయంలో బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ.. పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ప్రజలు ప్రాణాలకు తెగించి పోరాడిన ఫలితంగానే నేడు ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలవుతున్నాయని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బడా కార్పొరేట్ల ప్రయోజనాలకు అనుగుణంగా నూతన విద్యుత్ చట్టాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ చట్టం అమల్లోకి వస్తే విద్యుత్ ధరలను ఎప్పటికప్పుడు పెంచుకునే అవకాశం ప్రైవేట్, బహుళజాతి సంస్థలకు లభిస్తుందని అన్నారు. దీని ప్రభావంతో వ్యవసాయ రంగానికి అందుతున్న ఉచిత విద్యుత్ దెబ్బతినడంతో పాటు, పేదలకు లభిస్తున్న రాయితీలు, క్రాస్ సబ్సిడీలు కూడా లేకుండా పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజల నిత్యావసరమైన విద్యుత్ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు, కార్మికులు బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో నూతన విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని అర్జున్ కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, సత్యవతి, విక్రమ్, లీల, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# రక్షణ కరువైన గట్ల మల్యాల పీహెచ్‌సీ









-పగిలిన కిటికీలు.. కోతుల స్వైరవిహారం
-రోగులు, గర్భిణులు, బాలింతల్లో ఆందోళన
-పట్టించుకోని అధికారులు

నంగునూరు, ఆగస్టు 28(తెలంగాణ పత్రిక): సిద్దిపేట జిల్లా నంగునూరు మండల పరిధిలోని గట్ల మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. నిత్యం ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన ఈ ఆరోగ్య కేంద్రంలో కనీస రక్షణ చర్యలు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రి కిటికీల అద్దాలు పగిలిపోవడం, వాటిని ఇప్పటివరకు మరమ్మతులు చేయకపోవడంతో పీహెచ్‌సీ ప్రాంగణం కోతుల స్వైర విహారానికి కేంద్రంగా మారింది.

**వార్డుల్లోకి కోతుల ప్రవేశం**

కిటికీలకు రక్షణ లేకపోవడంతో కోతులు గుంపులుగా ఆసుపత్రి భవనంలోకి ప్రవేశిస్తున్నాయని రోగులు, వారి సహాయకులు చెబుతున్నారు. వార్డులు, ఆసుపత్రి పరిసరాల్లో కోతులు సంచరిస్తుండటంతో చికిత్స కోసం వచ్చిన రోగులు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు కోతుల బెడదతో ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఆసుపత్రిలోని వస్తువులు, మందులు, రికార్డులు తదితర సామగ్రికి కోతుల వల్ల నష్టం కలుగుతోందని వారు ఆరోపిస్తున్నారు. వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే ప్రజలకు సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**పారిశుద్ధ్యంపైనా ఆందోళన**

కోతుల బెడదతో పాటు పీహెచ్‌సీలో పారిశుద్ధ్య నిర్వహణపైనా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా నిరంతర చర్యలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని స్థానికులు అంటున్నారు. వైద్యం అందించే కేంద్రంలోనే పరిశుభ్రత లోపించడం వల్ల రోగుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు.

**అధికారులు స్పందించాలి**

ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందించే గట్ల మల్యాల పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారులు తక్షణమే పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. పగిలిపోయిన కిటికీలను వెంటనే పునరుద్ధరించడంతో పాటు, వాటికి పటిష్టమైన రక్షణ వలలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కోతులు ఆసుపత్రిలోకి ప్రవేశించకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఆసుపత్రి పరిసరాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచి, రోగులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు భయ రహితమైన, పరిశుభ్రమైన వైద్య వాతావరణాన్ని కల్పించాలని కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన ఆరోగ్య కేంద్రంలోనే భద్రత, పారిశుధ్యం లోపించడం ఆందోళన కలిగించే అంశమని, ఇకనైనా అధికారులు స్పందించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని గట్ల మల్యాల ప్రజలు కోరుతున్నారు.

# నూతన సమీకృత కలెక్టరేట్‌కు జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయం తరలింపు... డిపిఆర్ఓ రఫీక్

-నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచే శాఖ కార్యకలాపాలు.



తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది ఆగస్ట్ 28: ములుగు పాత కలెక్టరేట్‌లో ఇప్పటివరకు కొనసాగుతున్న జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయాన్ని నూతనంగా ప్రారంభించిన సమీకృత జిల్లా కార్యాలయాలసముదాయంలోకి తరలించినట్లు జిల్లా పౌర సంబంధాల అధికారి ఎం.డి. రఫీక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న జీ--20 గదిని జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయానికి జిల్లా కలెక్టర్ కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇకపై జిల్లా పౌర సంబంధాల శాఖకు సంబంధించిన అన్ని కార్యాలయ కార్యకలాపాలు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచే కొనసాగుతాయని తెలిపారు. జిల్లా పౌర సంబంధాల శాఖకు సంబంధించిన అధికారిక సమాచార వ్యవహారాలు, మీడియా సమన్వయం, ఇతర కార్యాలయ కార్యకలాపాలు ఇకపై నూతన ఐడీఓసీ నుంచే నిర్వహించనున్నట్లు డీపీఆర్ఓ ఆ ప్రకటనలో వెల్లడించారు.

# “బాలికను చదివిద్దాం--దేశాన్ని సాధికారత వైపు నడిపిద్దాం” సందేశంతో రాఖీలు కట్టిన బాలసదనం బాలికలు

-బాలికలను ఆశీర్వదించి మిఠాయిలు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.



తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది ఆగస్ట్ 28: రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలసదనం బాలికలు శుక్రవారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావును కలిసి రాఖీలు కట్టారు. “బాలికను చదివిద్దాం--దేశాన్ని సాధికారత వైపు నడిపిద్దాం” అనే సందేశంతో ప్రత్యేకంగా రూపొందించిన రాఖీలను కలెక్టర్‌కు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలికలను ఆప్యాయంగా పలకరించిఆశీర్వదించడంతోపాటు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాలికలతో మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని జీవితంలో మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బాలికల సంరక్షణ, విద్య, ఆరోగ్యం, భద్రత, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారికి మెరుగైన సేవలు అందించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. బాలికల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అందిస్తుందని భరోసా కల్పించారు. జిల్లా సంక్షేమ అధికారి ఇ.పి. ప్రేమలత మాట్లాడుతూ రక్షాబ ంధన్ప్రేమానుబ ంధంతోపాటు పరస్పర బాధ్యత, రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఒక బాలికను చదివించడం ద్వారా ఆమె భవిష్యత్తుతో పాటు కుటుంబం, సమాజం, దేశ పురోగతికి బాటలు వేయవచ్చని పేర్కొన్నారు. బాలికలకు సురక్షితమైన వాతావరణం, సమాన అవకాశాలు కల్పించి వారి ప్రతిభను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సహాయవాణి జిల్లా సమన్వయకర్త నరేష్, బాలసదనం సిబ్బంది అరుణ, రాణి, సఖి కేంద్రం సిబ్బంది లావణ్య, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బాన్స్ వాడ నియోజకవర్గ బిజెపి పార్టీ ఇన్చార్జ్ శశాంక్ జన్మదిన వేడుకలు

-వైద్యం కొరకు చెక్కులు అందజేత.

కోటగిరి తెలంగాణ పత్రిక ఆగస్టు 28.

కోటగిరి మండల కేంద్రంలోని బిజెపి పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో బిజెపి పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జ్ కోనేరు శశాంక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు జన్మదినాన్ని పురస్కరించుకొని పార్టీ నాయకులతో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ పంచి పెట్టారు. రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకుని మహిళలందరూ కలిసి కోనేరు శశాంక్ రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అక్క,చెల్లెలతో రాఖీలు కట్టించుకుని వారికి చిరు కానుక మహిళలకు చిరాలను అందజేశారు. నియోజకవర్గంలోని పేద ప్రజలకు వారి అనారోగ్య సమస్యలను తెలుసుకొని వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అందజేశారు. పేద ప్రజలకు అండగా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు





తెలిపారు. అనంతరం కస్తూరిబా పాఠశాలను సందర్శిస్తూ పాఠశాల విద్యార్థినిల భద్రత ను దృష్టిలో ఉంచుకొని సీసీ కెమెరాల ఏర్పాటు చేయడానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. జన్మదిన వేడుకల ను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా పేదలకు వైద్య సహాయం, మహిళలకు చీరల బహూకరణ, కస్తూరిబా పాఠశాల బాలికల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు వంటి సేవ కార్యక్రమాలతో నిర్వహించడం పట్ల పలువురు అభినందించా రు. ఈ కార్యక్రమంలో కోటగిరి రుద్రూర్ బిజెపి మండల అధ్యక్షులు వేముల నవీన్, హరికృష్ణ, అంబ సర్పంచ్ గంగాధర్ ఉపసర్పంచ్ సాయి ప్రసాద్ జిల్లా కౌన్సిల్ మెంబర్స్ సున్నం సాయిలు జిల్లా కిషన్ మోర్చా కార్యదర్శి సాయి రెడ్డి పొతంగల్ మండల బిజెపి మాజీ అధ్యక్షులు ప్రకాష్ పటేల్ చందూర్ మాజీ ఎంపీటీసీ నర్సింలు బాన్సువాడ రూరల్ అధ్యక్షులు శ్రీను మహిళా మోర్చా నాయకురాలు శ్యామల కులకర్ణి మామిడి శ్రీనివాస్ రవి సాయిలు ఓమన పటేల్ దావులయ్య శ్రీనివాస్ వడ్లశం పబ్బ శేఖర్ విలాస జగదీష్ సీతారాం నాయక్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ బియ్యం బకాయిలపై కఠిన చర్యలు

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
-పవన సుత రైస్ మిల్ రూ.12.28 కోట్ల డిఫాల్ట్
-ఖరీఫ్, రబీ 2021-22కు సంబంధించి 2,821.915 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం బకాయి
-డిఫాల్ట్ మిల్లర్‌తో పాటు ట్రక్ చిట్టీల్లో సంతకాలు చేసిన మరో వ్యక్తిపై కేసు నమోదు

పెద్దపల్లి, మంథని, ఆగస్టు 28(తెలంగాణ పత్రిక ) :

మంథని మండలంలోని పవన సుత రైస్ మిల్ సీఎంఆర్ బియ్యం డిఫాల్ట్‌కు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంథనిలోని రావికంటి పవన్ కుమార్ యాజమాన్యంలోని పవన సుత రైస్ మిల్‌కు ఖరీఫ్, రబీ 2021-22 సీజన్లలో మొత్తం 5,798.080 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించగా, దానికి సమానంగా 3,891.295 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి అందించాల్సి ఉందని తెలిపారు. అయితే మిల్లర్ ఇప్పటివరకు 1,069.380 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మాత్రమే



ఎఫ్‌సీఐ/టీజీఎస్‌సీఎస్‌సీఎల్‌కు అందించారని పేర్కొన్నారు. దీంతో 2,821.915 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం బకాయి ఉన్నట్లు తెలిపారు. ఇది 4,211.813 మెట్రిక్ టన్నుల సమాన ధాన్యానికి సమానమని, దీని విలువ రూ.9,82,51,492గా ఉందని పేర్కొన్నారు. 25 శాతం పెనాల్టీ రూ.2,45,62,873 కలిపి మొత్తం డిఫాల్ట్ మొత్తం రూ.12,28,14,365గా నిర్ధారించినట్లు తెలిపారు. రబీ 2021-22కు సంబంధించి పవన సుత రైస్ మిల్లుకు అప్పగించిన ధాన్యాన్ని మంథనిలోని శ్రీలక్ష్మి ఎంఆర్‌ఎం సూరయ్య పల్లి మిల్లుకు తరలించినట్లు తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించి పీపీసీల ద్వారా సమర్పించిన ట్రక్ చిట్టీలు, జాయింట్ సంతకాలను అధికారులు పరిశీలించగా, శ్రీలక్ష్మి ఎంఆర్‌ఎం, సూరయ్యపల్లికి చెందిన భాగస్వామి వొల్లాల నవీన్ కుమార్ సంతకాలు ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వానికి అప్పగించిన ధాన్యం స్వీకరణ, అంగీకారానికి సంబంధించిన ట్రక్ చిట్టీల్లో నవీన్ కుమార్ సంతకాలు ఉన్న నేపథ్యంలో ఆయన పాత్రపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పవన సుత రైస్ మిల్ యాజమాని రావికంటి పవన్ కుమార్, శ్రీలక్ష్మి ఎంఆర్‌ఎం భాగస్వామి వొల్లాల నవీన్ కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ధాన్యం, సీఎంఆర్ బియ్యం విషయంలో డిఫాల్ట్‌కు పాల్పడిన మిల్లర్లపై ప్రభుత్వ ఆదేశాల మేరకు కేసులు, రికవరీ తదితర చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

# మదర్ థెరిసా పొదుపు సమితిపై ఆరోపణల కలకలం!

-అధిక వడ్డీపై వడ్డీ వసూళ్లంటూ నామని హరికృష్ణ ఆరోపణలు

మంథని, ఆగస్టు 28 (తెలంగాణ పత్రిక):

ప్రపంచం మదర్ గా పిలువబడే మదర్ థెరిసా పేరుతో నెలకొల్పిన మదర్ తెరిసా మహిళ పొదుపు సమితి మహిళలనే వేదనకు గురి చేస్తున్న వైనం స్థానికంగా చర్చనీయాంశం అవుతుంది నోబుల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరిసా పేరుకే కళంకం తెచ్చేలా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ సమితి పై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మహిళలు ఆవేదన చెందుతున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, పొదుపు కోసం ఏర్పాటైన మదర్ థెరిసా మహిళా పొదుపు సమితిపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సమితిలో సభ్యులుగా ఉన్న మహిళల పొదుపు సొమ్ము, రుణాల పంపిణీ, వడ్డీ వసూళ్లు, ఖాతాల నిర్వహణ, సంవత్సరాలుగా జరిగిన ఆర్థిక లావాదేవీలపై పూర్తిస్థాయిలో స్పష్టత లేదంటూ కొందరు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిగ్గు తేల్చాలని వారు కోరుతున్నారు. మంథని పట్టణంలోని లైన్‌గడ్డ సమీపంలో కొనసాగుతున్న ఈ సమితిపై మహిళల నుంచి వస్తున్న ఆరోపణలు ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. రుణాలపై అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని, వడ్డీపై వడ్డీ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని కొందరు సభ్యులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత అన్నది అధికారుల విచారణలో తేలాల్సి ఉంది. సమితి 2002లో ప్రారంభమైనట్లు ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సభ్యుల నుంచి ఎంత పొదుపు సొమ్ము సేకరించారు..? ఎంత మొత్తాన్ని రుణాలుగా ఇచ్చారు..? రుణాలపై ఎంత వడ్డీ వసూలు చేశారు..? సభ్యులకు ఎంత మొత్తం తిరిగి చెల్లించారు..? ప్రస్తుతం సమితి వద్ద ఎంత మొత్తం ఉంది..? తదితర వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని వారు కోరుతున్నారు. సమితి రిజిస్ట్రేషన్, నిర్వహణకు సంబంధించిన పత్రాలు, సభ్యుల ఖాతాలు, పొదుపు



రికార్డులు, రుణ రిజిస్టర్లు, రసీదులు, బ్యాంకు లావాదేవీలు తదితరాలను అధికారులు పరిశీలిస్తే అసలు విషయం వెలుగులోకి వస్తుందని ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. తమ పొదుపు, రుణాలు, వడ్డీలకు సంబంధించిన వివరాలు అడిగినప్పుడు సరైన సమాచారం ఇవ్వడం లేదని కొందరు మహిళలు ఆరోపిస్తున్నారు. ముందుగా బకాయిలు చెల్లించాలి.. ఆ తర్వాత లెక్కలు చెబుతామంటున్నారని వారు వాపోతున్నారు. అంతేకాకుండా లెక్కలపై ప్రశ్నించిన మహిళలను సమితి నుంచి తొలగించారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై సమితి నిర్వాహకుల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది. ఈ వ్యవహారంపై ఫిర్యాదుదారులు సంబంధిత అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లడంతో పాటు సమితికి సంబంధించిన పత్రాలు, రికార్డులు, లావాదేవీలకు సంబంధించిన వివరాలను ఆధారాలుగా సమర్పించినట్లు తెలుస్తోంది. అధికారులకు అందజేసిన ఫిర్యాదు పత్రాల్లో సమితి నిర్వహణ, సభ్యుల ఆర్థిక లావాదేవీలు, రుణాలు, వడ్డీలకు సంబంధించిన పలు అంశాలపై ప్రశ్నలు లేవనెత్తారు. ఫిర్యాదు పత్రాల ఆధారంగా అధికారులు సంబంధిత రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలించడంతో పాటు, అవసరమైతే సభ్యుల నుంచి కూడా వాంగ్మూలాలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు. సమితిలో సభ్యుల నుంచి సేకరించిన పొదుపు సొమ్ము, రుణాల పంపిణీ, వడ్డీ వసూళ్లు, తిరిగి చెల్లింపులు, నిర్వహణ ఖర్చులు తదితర ప్రతి ఆర్థిక లావాదేవీని ప్రతినెలా సభ్యుల సమావేశంలో వెల్లడించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతి మహిళకు ఆమె పేరుతో ఉన్న పొదుపు మొత్తం, తీసుకున్న రుణం, చెల్లించిన మొత్తం, వడ్డీ, మిగిలిన బకాయి తదితర వివరాలను స్పష్టంగా తెలియజేయాలని కోరుతున్నారు. మదర్ తెరిసా పొదుపు సమితి చైర్మన్ వ్యవహారాలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని నాలుగో వార్డు గంగాపురికి చెందిన నామని హరికృష్ణ కోరారు. సమితి ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు జరిగిన మొత్తం ఆర్థిక లావాదేవీలను అధికారులు పరిశీలించాలని, సభ్యుల పొదుపు సొమ్ము, రుణాల పంపిణీ, వడ్డీ వసూళ్లు, బ్యాంకు లావాదేవీలు, ఖాతా పుస్తకాలు, రసీదులు, రుణ రిజిస్టర్లు తదితర రికార్డులను తనిఖీ చేయాలని ఆయన కోరారు. మహిళల కష్టార్జిత సొమ్ముకు పూర్తి లెక్కలు చెప్పాలి. సమితిలో ప్రతి నెలా జరిగే ఆర్థిక లావాదేవీలను సభ్యులందరి ముందు ఉంచేలా చర్యలు తీసుకోవాలి. కలెక్టర్ చొరవ తీసుకుని సమగ్ర విచారణ జరిపించాలి" అని నామని హరికృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత శాఖ అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని మహిళలు కోరుతున్నారు. సమితి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన లావాదేవీలను ఆడిట్ చేయడంతో పాటు, సభ్యుల ఫిర్యాదులను స్వీకరించి వాస్తవాలను నిర్ధారించాలని డిమాండ్ చేస్తున్నారు. మహిళల పొదుపు సొమ్ము విషయంలో అనుమానాలకు తావులేకుండా పూర్తి పారదర్శకత తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వారు పేర్కొంటున్నారు. మదర్ తెరిసా పేరుతో కొనసాగుతున్న ఈ సమితిపై వస్తున్న ఆరోపణలు నిజమా..? కాదా..? అన్నది అధికారిక విచారణలోనే తేలాల్సి ఉంది. అందుబాటులో ఉన్న ఫిర్యాదు పత్రాలు, రికార్డులు, ఆర్థిక లావాదేవీలను పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని, మహిళలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని నామని హరికృష్ణ కోరారు.

## పాపన్న పేటలో ఘనంగా శ్రీరామ భాణాల ఊరేగింపు కార్యక్రమం

పాపన్నపేట,ఆగస్టు28 (తెలంగాణ పత్రిక)

మండల కేంద్రమైన పాపన్నపేట పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శ్రావణ మాసం రాఖి పౌర్ణమి శుక్రవారం రోజు శ్రీ రామ బాణాల శోభాయాత్ర కార్యక్రమం సాయంత్రం పద్మశాలి సంఘం వద్ద నుండి మొదలై గ్రామ పురవీధుల గుండా భక్తి భజన పాటలతో బాణాల ఊరేగింపు కార్యక్రమం శివాలయం వరకు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాపన్నపేట పద్మశాలి సంఘం చైర్మెన్ కొడుపాక విఠల్, వైస్ ఛైర్మెన్ పల్లె సంగమేశ్వర్, పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు వళ్ళందేశి శ్రీనివాస్ పడిగే కృష్ణ, దాసరి యాదగిరి, కొడుపాక శివశంకర్, నగేష్, జూకంటి సంగయ్య, అచ్చుకట్ల గురునాద్, చామంతుల మల్లయ్య, పల్లె లక్ష్మణ్,పల్లె రాజు,, బద్దాపురం సంగమేశ్వర్, తూర్పు రాములు, తూర్పు రాజు, తూర్పు రాము, వళ్ళందేశి శివకుమార్, పల్లె రాములు, మదనాల అరవింద్, అచ్చుకట్ల మహేష్, చామంతుల అరవింద్ వళ్ళందేశి మల్లేశం, కొడుపాక ఉమామహేశ్వర్, కొడుపాక పూర్ణ చందర్ రాజారాం చంద్రం పల్లె ప్రసాద్,పడిగే శ్రీకాంత్ పల్లె సాయి కిరణ్, బద్దాపురం రాజు, ఊరటి లక్ష్మి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మాల మహానాడు జిల్లా యువజన అధ్యక్షుడిగా వాసుమల్ల గౌతమ్

-1350 కిలోమీటర్ల పాదయాత్రలో సేవాభావం, కష్టపడే తత్వాన్ని గుర్తించిన రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్



తెలంగాణ పత్రిక ; ఆగస్టు28భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:

మాల మహానాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూత్ అధ్యక్షుడిగా వాసుమల్ల గౌతమ్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ గౌతమ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహించిన 1350 కిలోమీటర్ల పాదయాత్రలో రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్‌తో కలిసి వాసుమల్ల గౌతమ్ పాల్గొన్నారు. ఈ సుదీర్ఘ పాదయాత్ర సందర్భంగా గౌతమ్‌లోని సేవాభావం, ఉదార స్వభావం, కష్టపడే తత్వాన్ని రాష్ట్ర అధ్యక్షులు దగ్గరగా గమనించారు. మాల మహానాడు ఆశయాలు, కార్యక్రమాల కోసం చురుకుగా పనిచేసే సామర్థ్యం గౌతమ్‌లో ఉందని గుర్తించి జిల్లా యువజన అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. మాలల ఐక్యత కోసం కృషి చేస్తా: గౌతమ్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వాసుమల్ల గౌతమ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి జిల్లా యూత్ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మాలల ఐక్యత, అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని, రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. యువతను సంఘటితం చేస్తూ మాల మహానాడు ఆశయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని గౌతమ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుమల్ల సుందర్రావు, జిల్లా అధ్యక్షులు తోటమల్ల రమణ మూర్తి, సెనగ వెంకటేశ్వర్లు, గుర్రం వెంకటరత్నం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ. డెల్లి గణపతి, పెంకి శ్రీనివాసరావు, వల్లమల్ల వెంకటరత్నం, గడిదేసి ప్రభాకర్, శనగ రామ్‌చందర్, హరీష్, కూరపాటి దాస్, శెట్టి కమలాకర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## చింతకుంట గ్రామం లో మలేరియా ఫీవర్ సర్వే




తెలంగాణ పత్రిక ఆగస్టు 28 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం

మల్లెలమడుగు గ్రామపంచాయతీ పరిధిలో గల చింతకుంట గ్రామంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది అలాగే ఫీవర్ సర్వే నిర్వహించి ఫ్రైడే -డ్రై డే చేయటం ఆరోగ్య సిబ్బంది చింతకుంట గ్రామంలో కుటుంబాలను సందర్శించి జ్వరం వచ్చిన వారి నుంచి రక్త నమోనాలను తీయటం జరిగింది క్యాంపులోప్రజలఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అవసరమైన మందులను అందించడం మరియు దోమల పెరుగుదలను అరికట్టడం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం జ్వరం వచ్చిన వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి అంటి విషయాలను ప్రజలకు వివరించారు పాల్గొన్న వారు ఏ ఎన్ ఎం లలిత కుమారి నాగమణి ఆశ పూర్ణ తదితరులు పాల్గొన్నారు

# బ్రాహ్మణ అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ సెక్రటరీ గా వింజమూరి సుధాకర్



తెలంగాణ పత్రిక, (ఆగస్టు 28) హైదరాబాద్ :

బ్రాహ్మణ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ స్టేట్ బాడీ ఎన్నికలు ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో నూతన కార్యవర్గంతో పాటు డాక్టర్స్ వింగ్, లీగల్ సెల్, యూత్ వింగ్, వివాహ పరిచయ వేదిక వింగ్‌లకు కూడా నూతన కార్యవర్గాలు ఎన్నికయ్యాయి. బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ స్టేట్ బాడీ నూతన కన్వీనర్‌గా పి.వి.రామచంద్రరావు, అధ్యక్షుడిగా బి. నీలకంఠం ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్లుగా యమునా పాట, మల్లాది వాసు, ప్రొఫెసర్ మధుసూదన్ రావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మాధవరావు, సీతారామయ్య, కె. ఎస్. వరప్రసాద్, డాక్టర్ వెంకట మురళి, పి. వెంకటరమణలు ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీగా వింజమూరి సుధాకర్, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా కె. రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాగేంద్ర ఎన్నికయ్యారు. కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్‌గా హెచ్. వి. రాంప్రసాద రావు, సెక్రటరీగా వాణి రమణ, కల్చరల్ ఈవెంట్స్ జాయింట్ సెక్రటరీగా రామ్మోహన్ నియమితులయ్యారు. స్కిల్ డెవలప్‌మెంట్ కన్వీనర్‌గా పి. ఫణి రాజు, పబ్లిసిటీ సెక్రటరీగా భాను ప్రకాష్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సెక్రటరీగా దుర్గాప్రసాద్ ఎన్నికయ్యారు. యూత్ వింగ్ కన్వీనర్‌గా వేదాంతం పవన్, కో-కన్వీనర్‌గా కల్యాణ్ చక్రవర్తి బాధ్యతలు చేపట్టారు. అడ్వైజర్లుగా కె. రంగారావు (ఐఆర్ఎస్), బి.ఆర్.వి సుశీల్ కుమార్, ప్రోగ్రామ్ కన్వీనర్లుగా భరత్ కుమార్, సంజీవ్ చక్రవర్తి ఎన్నికయ్యారు. డాక్టర్స్ వింగ్‌లో ప్రెసిడెంట్‌గా వద్దిరాజు రాకేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ నరసరాజ్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ లక్ష్మీనాద్ శివరాజు, డాక్టర్ భరద్వాజ్ శ్రీనాథ్ ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీగా డాక్టర్ టి. నగేష్, ట్రెజరర్‌గా డాక్టర్ శ్రావణి ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డాక్టర్ విశ్వనాథ్, అమన్ చంద్ర, డాక్టర్ రమేష్ చంద్రలు ఎన్నికయ్యారు. లీగల్ సెల్ అధ్యక్షుడిగా పాలకుర్తి కిరణ్, జనరల్ సెక్రటరీగా సాయి బాధ్యతలు చేపట్టారు. ఉమెన్స్ వింగ్‌లో స్టేట్ కన్వీనర్‌గా డాక్టర్ స్రవంతి, ప్రెసిడెంట్‌గా డాక్టర్ వింజమూరి ప్రియదర్శిని, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ కృష్ణవేణి, వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ కోట రాజ్యలక్ష్మి ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీగా అనురాధ, కల్చరల్ సెక్రటరీగా అంజలి దేశ్‌ముఖ్, ట్రెజరర్‌గా శృతి కృష్ణ, లీగల్ సెక్రటరీగా విజయలక్ష్మి బాధ్యతలు చేపట్టారు. స్కిల్ డెవలప్‌మెంట్ కన్వీనర్‌గా స్మిత తివారి, స్కిల్ డెవలప్‌మెంట్ ఈవెంట్ సెక్రటరీగా రమ అయ్యంగార్, ట్రెజరర్‌గా వి. విద్యావతి ఎన్నికయ్యారు. యూత్ వింగ్‌కు వేదాంతం పవన్, వివాహ పరిచయ వేదికకు అక్కిరాజు గోపాలరావు నూతన బాధ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వివిధ కార్యవర్గ సభ్యులు సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

# నగరవాసులకు ముఖ్య సూచన: 24 గంటల పాటు నిలిచిపోనున్న మంచినీటి సరఫరా



తెలంగాణ పత్రిక, (ఆగస్టు 28) హైదరాబాద్ :

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు కాలనీలకు రెండు రోజుల పాటు మంచినీటి ఎద్దడి తప్పేలా లేదు. బండ్లగూడ క్రాస్ రోడ్డు వద్ద చేపడుతున్న పైప్‌లైన్ జంక్షన్ నిర్మాణ పనుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాలకు నీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ (జలమండలి) అధికారులు ప్రకటించారు. జలమండలి వర్గాల సమాచారం మేరకు, శనివారం (ఆగస్టు 29) ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ నిలుపుదల ఆదివారం (ఆగస్టు 30) ఉదయం 10 గంటల వరకు అంటే సుమారు 24 గంటల పాటు కొనసాగనుంది. మరమ్మతులు, పైప్‌లైన్ అనుసంధాన పనులు పూర్తయిన వెంటనే ఆదివారం ఉదయం నుంచి యథావిధిగా సరఫరా పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు. ఈ అంతరాయం కారణంగా శాస్త్రిపురం, బండ్లగూడ, శంషాబాద్, మధుబన్, దుర్గా నగర్, సులేమాన్ నగర్, పీడీపీ, గోల్డెన్ హైట్స్, అత్తాపూర్, కిస్మత్‌పూర్, 9వ నంబర్ ప్రాంతం, అల్లాబండ, భోజగుట్ట, గంధంగూడ, ప్రసన్న నగర్, జూబ్లీహిల్స్, తట్టిఖానా, గచ్చిబౌలి, మాదాపూర్ సహా పలు కాలనీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సదరు ప్రాంతాల నివాసితులు ముందు జాగ్రత్తగా తగినంత నీటిని నిల్వ చేసుకోవాలని, అంతరాయం సమయంలో నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని జలమండలి అధికారులు కోరారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే జలమండలి హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు.

# రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, బీర్ల అనిత

తెలంగాణ పత్రిక ఆగస్టు 28 యాదాద్రి భువనగిరి/ హైదరాబాద్:

రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య , బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనితలు శుక్రవారం రాఖీ పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ఆడపడుచులు, మహిళలు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఆప్యాయత, అనురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సందర్భంగా ఆడపడుచులు చూపిన ప్రేమాభిమానాలకు బీర్ల అయిలయ్య కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత అన్నదమ్ములకు స్వయంగా రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి



శుభాకాంక్షలు తెలిపారు. సోదర, సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయత, అనుబంధాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. రాఖీ పౌర్ణమి పండుగ ప్రతి కుటుంబంలో సంతోషాలను



నింపాలని, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఆప్యాయతలు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని వారు ఆకాంక్షించారు.

# పాల్వంచలో 30న జిల్లా స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలు

**-ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్.. పవర్ లిఫ్టర్ల ప్రతిభకు వేదికగా యూనిటీ గోల్డ్స్ జిమ్**

తెలంగాణ పత్రిక ; ఆగస్టు28 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ:

జిల్లాలోని పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు వారి ప్రతిభను వెలుగులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో పాల్వంచలో జిల్లా స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలను నిర్వహించనున్నట్లు యూనిటీ గోల్డ్స్ జిమ్ నిర్వాహకులు తెలిపారు. ఈనెల 30వ తేదీన పాల్వంచ ఇంజనీరింగ్ అసోసియేషన్ హాల్‌లో యూనిటీ గోల్డ్స్ జిమ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎంకరేజ్మెంట్ బెంచ్ ప్రెస్ పోటీలు నిర్వహించనున్నాయి. ఈ పోటీలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. శుక్రవారం పాల్వంచ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో యూనిటీ గోల్డ్స్ జిమ్ నిర్వాహకులు ఎం.డి. నూర్, ఎం.డి. జాకీర్, ఎం.డి. అమీర్ ఖాన్, ఎస్.కె. సల్మాన్ మాట్లాడుతూ.. జిల్లాలోని పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పాల్వంచ పట్టణంలో తొలిసారిగా జిల్లా స్థాయిలో బెంచ్ ప్రెస్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 9 కేటగిరీల్లో పోటీలు పోటీలను సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, మాస్టర్స్ విభాగాల్లో మొత్తం 9 కేటగిరీలలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ జిమ్‌లకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకునే అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభం పోటీలు ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని జిమ్ నిర్వాహకులు, పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు, క్రీడాభిమానులు ఉదయం 8 గంటలలోపు ఇంజనీరింగ్ అసోసియేషన్ హాల్ ప్రాంగణానికి చేరుకుని పోటీలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. పాల్వంచలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ జిల్లా స్థాయి బెంచ్



ప్రెస్ పోటీలు యువ క్రీడాకారులకు మంచి ప్రోత్సాహాన్ని అందించడంతో పాటు పవర్ లిఫ్టింగ్ క్రీడకు మరింత ఆదరణ తీసుకురావాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. పోటీలకు సంబంధించిన వివరాల కోసం సంప్రదించండి: 9948879786 8501874405

# 20.360 కిలోల గంజాయి పట్టివేత ఇద్దరు నిందితుల అరెస్ట్



తెలంగాణ పత్రిక: (ఆగస్టు 28)

యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి పర్యవేక్షణలో, చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ ఆధ్వర్యంలో, ఈగల్ ఫోర్స్ సహకారంతో పోలీసులు అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.నిందితుల వద్ద నుండి 20.360 కిలోల గంజాయి, మూడు మొబైల్ ఫోన్లు మరియు ఒక ఫ్రాంక్స్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో వాహనాల తనిఖీలో భాగంగా 27 న చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్. కృష్ణమాల్ కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, పోలీస్ సిబ్బందితో కలిసి ఎన్‌హెచ్-65 హైదరాబాద్ రోడ్డులోని చౌటుప్పల్ విద్యుత్ ఉపకేంద్రం సమీపంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఓడీ-02-డీఎస్-897 నంబర్ గల ఫ్రాంక్స్ కారును అనుమానంతో ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహనం వెనుక భాగంలోని డిక్కీలో గోధుమరంగు టేపుతో చుట్టిన ప్యాకెట్లను పోలీసులు గుర్తించారు. ప్యాకెట్లను పరిశీలించగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 20 ప్యాకెట్లలో 20.360 కిలోల గంజాయి ఉన్నట్లు తూకం వేసి నిర్ధారించారు. 20.360 కిలోల గంజాయి, 3 మొబైల్ ఫోన్లు, 1 ఫ్రాంక్స్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే త్రిలోచన్ సామంత్రా, ( 30), రాజ్‌నగర్ గ్రామం, కేంద్రపారా జిల్లా, ఒడిశా రాష్ట్రం. సాగర్‌బాల్, ( 23) , రాజ్‌నగర్, కేంద్రపారా జిల్లా, ఒడిశా రాష్ట్రం.

**-విచారణలో కీలక విషయాలు**

పోలీసుల విచారణలో నిందితులు ఒడిశా రాష్ట్రం నుండి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి, తెలంగాణలో అధిక ధరకు విక్రయించేందుకు అక్రమంగా తరలిస్తున్నట్లు వెల్లడైందని, గంజాయిని తరలించినందుకు నిందితులకు రూ.50,000/- చెల్లిస్తామని ఆఫర్ చేసినట్లు కూడా విచారణలో వెల్లడైంది. ఈ అక్రమ గంజాయి రవాణా వెనుక ఉన్న ఇతర వ్యక్తుల ప్రమేయం, గంజాయి సరఫరా వ్యవస్థ మరియు కొనుగోలు--విక్రయాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**-చట్టపరమైన చర్యలు**

స్వాధీనం చేసుకున్న గంజాయి, మొబైల్ ఫోన్లు మరియు వాహనాన్ని తదుపరి చట్టపరమైన చర్యల కోసం పోలీసులు స్వాధీనంలో ఉంచారు. నిందితులపై మాదకద్రవ్యాల నియంత్రణ చట్టం కింద కేసు నమోదు చేసి, ఇద్దరినీ అరెస్ట్ చేశారు. అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించారు.

**-మత్తు పదార్థాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు**

యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన





చర్యలు తీసుకుంటామని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పోలీసులు తెలిపారు. మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు పోలీసులకు సహకరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ యుద్ధభేరి.. వెయ్యి రోజుల పాలనపై పోరాటానికి కేటీఆర్ పిలుపు

తెలంగాణ పత్రిక, (ఆగస్టు 28) హైదరాబాద్ :

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో, ఆ ప్రభుత్వ వైఫల్యాలపై విస్తృత స్థాయిలో ఉద్యమించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం పార్టీ శ్రేణులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, రాబోయే పోరాట కార్యాచరణపై నేతలకు దిశానిర్దేశం చేశారు. సెప్టెంబర్ 2వ తేదీ నుంచి వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వినూత్న రీతిలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కేటీఆర్ పార్టీ



నేతలను ఆదేశించారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలులో ప్రభుత్వం విఫలమైన తీరును ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. వెయ్యి రోజులు గడిచినా నెరవేరని హామీలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని, ప్రభుత్వ వైఫల్యాలతో పాటు అవినీతి అంశాలపైనా పోరాటం ఉధృతం చేయాలని నేతలకు స్పష్టం చేశారు. ఈ పోరాట కార్యక్రమాల్లో భాగంగా సెప్టెంబర్ 1న తెలంగాణ భవన్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెడుతూ బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్‌ను విడుదల చేయనుంది. దీని ద్వారా ప్రభుత్వ తీరుపై ప్రజల్లోకి నేరుగా వెళ్లాలని పార్టీ యోచిస్తోంది.

# ఓలా కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్.. ఒక్క ఛార్జ్‌తో 301 కి.మీ

## బిజినెస్



**ఓలా ఎస్1జెడ్ ప్రారంభ ధర రూ.79,999**
**5.1 ఎకెడబ్ల్యూహెచ్ మోడల్ ధర రూ.99,999**
**గరిష్ఠంగా 301 కి.మీ. రేంజ్**
**గరిష్ఠ వేగం గంటకు 70 కి.మీ**
**రూ.999తో బుకింగ్**

ఎలక్ట్రిక్ స్కూటర్ మార్కెట్‌లో ఓలా ఎలక్ట్రిక్ మరో కొత్త మోడల్‌ను తీసుకొచ్చింది. కంపెనీ వ్యవస్థాపకుడు భవీశ్ అగర్వాల్ కొత్త ఎస్1జెడ్ సిరీస్‌ను ఆవిష్కరించారు. దీని ప్రారంభ ధర రూ.79,999గా నిర్ణయించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన 'భారత్ సెల్' ఎల్ఎఫ్‌పీ బ్యాటరీ టెక్నాలజీని ఉపయోగిస్తున్న తొలి మాస్ మార్కెట్ స్కూటర్లలో ఇది ఒకటని కంపెనీ తెలిపింది. ఎస్1జెడ్ రెండు వేరియంట్లలో లభిస్తుంది. 3.1 ఎకెడబ్ల్యూహెచ్ బ్యాటరీ వేరియంట్ ధర రూ.79,999గా ఉంది. 5.1 ఎకెడబ్ల్యూహెచ్ వేరియంట్ ధర రూ.99,999. ఇవి ఎక్స్‌షోరూమ్ ధరలు. రూ.999 చెల్లించి ఓలా ఎలక్ట్రిక్ అధికారిక వెబ్‌సైట్‌లో స్కూటర్‌ను రిజర్వ్ చేసుకోవచ్చు. రాష్ట్రం, రిజిస్ట్రేషన్, ఇతర ఛార్జీలను బట్టి ఆన్‌రోడ్ ధర మారుతుంది. బ్యాటరీ సామర్థ్యానికి అనుగుణంగా రేంజ్‌లోనూ తేడా ఉంది. 3.1 ఎకెడబ్ల్యూహెచ్ మోడల్ ఒక్కసారి ఛార్జ్ చేస్తే గరిష్ఠంగా 179 కి.మీ. ప్రయాణిస్తుందని కంపెనీ పేర్కొంది. 5.1 ఎకెడబ్ల్యూహెచ్ వెర్షన్ 301 కి.మీ. వరకు రేంజ్ ఇస్తుందని తెలిపింది. రెండు మోడళ్ల గరిష్ఠ వేగం గంటకు 70 కి.మీ. వీటిలో 4 ఎకెడబ్ల్యూ పీక్ పవర్ మోటార్ ఉంటుంది. ఎస్1జెడ్‌లో జీపీఎస్ ట్రాకింగ్, క్రూజ్ కంట్రోల్, రీజెనరేటివ్ బ్రేకింగ్, రివర్స్ మోడ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ఓవర్-ది-ఎయిర్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు కూడా అందుతాయి. ఓలా ఎలక్ట్రిక్ యాప్ ద్వారా రైడ్ వివరాలను తెలుసుకోవచ్చు. ఇరుకైన ప్రదేశాల్లో స్కూటర్‌ను సులభంగా తిప్పేందుకు 'ఈజీ పార్క్' ఫీచర్ ఇచ్చారు. ఎస్1జెడ్ నాలుగు రంగుల్లో లభిస్తుంది. వైట్, ఆంత్రాసైట్, స్కై స్ప్లాష్ బ్లూ, మాచా గ్రీన్ రంగుల్లో కొనుగోలు చేయవచ్చు. రెండు వేరియంట్లలోనూ 12 అంగుళాల వీల్స్ ఉన్నాయి. 3.1 ఎకెడబ్ల్యూహెచ్ మోడల్ డెలివరీలు 2026 డిసెంబరులో ప్రారంభం కానున్నాయి. 5.1 ఎకెడబ్ల్యూహెచ్ మోడల్ డెలివరీలు 2027 మార్చి నుంచి మొదలవుతాయి.

# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్..

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఈ నెలాఖరు లేదంటే సెప్టెంబరు నుంచి టీజీపీఎస్సీ వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయనుంది. ఇప్పటికే 9 నోటిఫికేషన్లు జారీ చేసిన కమిషన్.. మరో 15 వరకు నోటిఫికేషన్లు ఇచ్చే అవకాశం ఉంది. తాజాగా ఆర్థిక శాఖ అనుమతించినహైదరాబాద్, ఆగస్ట్ 28: తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో భారీగా ఉద్యోగాల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (౧ఈూాజ) సిద్ధమవుతోంది. ఈ నెలాఖరు లేదా సెప్టెంబరు నుంచి వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేసేందుకు కమిషన్ కసరత్తు పూర్తి చేసినట్లు సమాచారం. ఈ ఏడాది ఇప్పటికే తొమ్మిది ఉద్యోగ ప్రకటనలు జారీ చేసిన టీజీపీఎస్సీ.. తాజాగా మరో 15 వరకు నోటిఫికేషన్లు విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. నెలకు రెండు లేదా మూడు చొప్పున ఈ నోటిఫికేషన్లు వెలువడే అవకాశం ఉందని సమాచారం. 3,800 పోస్టులకు 15 నోటిఫికేషన్లు ఇటీవల ఆర్థిక శాఖ అనుమతించిన 3,800 పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రతిపాదనలు టీజీపీఎస్సీకి అందినట్లు తెలుస్తోంది. వీటిలో ఇంజినీరింగ్, ఇతర ప్రొఫెషనల్ కేటగిరీలకు చెందిన పోస్టులు గణనీయంగా ఉన్నాయి. ఈ పోస్టుల్లో అత్యధికంగా 1,398 అటవీ బీట్ అధికారి (ఫ్రీశీతీవర్ దీమ్ ూటటఱఎవతీ) పోస్టులు ఉన్నట్లు సమాచారం. వీటి తర్వాత టౌన్ ప్లానింగ్, స్టాటిస్టికల్ అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్ తదితర విభాగాల్లో భారీ సంఖ్యలో ఖాళీలు ఉన్నట్లు తెలుస్తోంది. నోటిఫికేషన్లను విడుదల చేసే ముందు పోస్టుల సంఖ్య, విద్యార్హతలు, వయోపరిమితి, ఇతర అర్హతలకు సంబంధించిన అంశాలను మరోసారి పరిశీలించి తుది ఆమోదం పొందే అవకాశం ఉంది. ఇప్పటికే 9 నోటిఫికేషన్లు.. మరో 15కి కసరత్తు ఈ ఏడాది టీజీపీఎస్సీ ఇప్పటికే తొమ్మిది ఉద్యోగ ప్రకటనలను విడుదల చేసింది. ఆయా నోటిఫికేషన్లకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కూడా పూర్తయింది. పరీక్షలను ఎప్పుడు నిర్వహించాలనే విషయంపై తాత్కాలిక షెడ్యూల్‌ను సంబంధిత నోటిఫికేషన్లలోనే పేర్కొన్నారు. మిగిలిన పోస్టులకు కూడా దశలవారీగా నోటిఫికేషన్లు విడుదల చేసి నియామక ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని కమిషన్ భావిస్తున్నట్లు సమాచారం. నియామక ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు టీజీపీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షలు (జదీ=ు) నిర్వహించేందుకు ప్రాధాన్యం ఇస్తోంది. పరీక్ష పూర్తయిన వెంటనే అభ్యర్థి సాధించిన స్కోర్ స్క్రీన్‌పై కనిపించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం ముందుగానే సిద్ధం చేసిన ప్రాథమిక కీ ఆధారంగా అభ్యర్థికి పరీక్ష ముగిసిన వెంటనే మార్కులు చూపించే విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలుస్తోంది.

# తెలంగాణలో పెరిగిన క్రైమ్ రేట్..

తెలంగాణలో గత మూడేళ్లతో పోలిస్తే మొత్తం నేరాల సంఖ్య 7.15 శాతం మేర పెరిగింది. ముఖ్యంగా మాదకద్రవ్యాలు (నార్కోటిక్స్) సంబంధిత కేసులు 46.10 శాతం పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశంలో ఈ గణాంకాలను వెల్లడించారు. పోలీసు శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం, 2023-24లో 2,65,377గా నమోదైన మొత్తం కేసుల సంఖ్య, 2025-26 నాటికి 2,84,363కు చేరింది. ఇదే సమయంలో నార్కోటిక్స్ కేసులు 2,026 నుంచి 2,960కు పెరిగాయి. ఇక వ్యవస్థీకృత నేరాలు (ఆర్గనైజ్డ్ క్రైమ్) ఏకంగా 1,704 శాతం పెరుగుదలతో 25 నుంచి 451కి చేరడం గమనార్హం కాగా, కొన్ని విభాగాల్లో నేరాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. సైబర్ నేరాలు 13.29 శాతం, ఆర్థిక నేరాలు 13.28 శాతం తగ్గాయి. అలాగే హత్యలు, దోపిడీల వంటి తీవ్రమైన నేరాలు కూడా 10.33 శాతం మేర తగ్గాయి. ముఖ్యంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి కేసులు

# ఎవరి జాగీరు అని మీ ఫొటోలు వేసుకుంటున్నారు?

తెలంగాణలో గత కేసీఆర్ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత రేవంత్ రెడ్డి పాలనకు ఎలాంటి వ్యత్యాసం లేదని... ఈ పాలనతో రాష్ట్ర ప్రజలు పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని భావిస్తున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఐదు కిలోల సన్న బియ్యం ఉచితంగా ఇస్తున్నప్పటికీ ప్రధాని మోదీ ఫొటోను ఎక్కడా వేయడం లేదని... కానీ కాంగ్రెస్ నేతలు ఎవరి జాగీరని వారి ఫొటోలు వేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి దేశంలో మత కల్లోలాలు జరుగుతున్నాయని ప్రచారం చేస్తున్నారని విమర్శించిన ఈటల, గతంలో కాంగ్రెస్ హయాంలోనే లుంబిని పార్క్, గోకుల్ చాట్‌లలో బాంబు పేలుళ్లు జరిగాయని గుర్తు చేశారు. ఢిల్లీ వెళ్లినప్పుడు మోదీ ఆశీర్వాదం కావాలని కోరే సీఎం రేవంత్... ఇక్కడకు వచ్చాక మాత్రం విమర్శలు చేయడం ఆయన ద్వంద్వ విధానానికి నిదర్శనమన్నారు. కేంద్రం ఇచ్చే నిధుల వల్లే రాష్ట్రంలో రహదారులు, రైల్వేలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు వేసి, కాంగ్రెస్ నాయకులకు కేటాయించుకుంటున్నారని ఈటల మండిపడ్డారు. 'ఇది మీ తాత జాగీరు కాదు' అంటూ ఈటల మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు, మెట్రో ఫేజ్-1, ఫేజ్-2లకు తగిన సహాయం అందిస్తోందని స్పష్టం చేశారు. మల్కాజ్‌గిరి, మేడ్చల్ పరిధిలోని పలు రైల్వే గేట్ల వద్ద ఆర్‌వోబీ, ఆర్‌యూబీ నిర్మాణాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ అంశంపై సీఎస్‌ను కలిసి చర్చించానన్నారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి స్టేషన్ల అభివృద్ధికి అమృత్ పథకం కింద కేంద్రం రూ.22 కోట్లు ఇస్తోందని ఈటల వెల్లడించారు.

# విద్యుత్ సరఫరాకు అంతరాయం-చక్రపాణి

విద్యుత్ ఏఈ,మహేశ్వరం

రంగారెడ్డి జిల్లా ఆగస్టు28ప్రతినిధి ఈ.పద్మారావు కాపు:

తుక్కుగూడ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తు పనుల దృష్ట్యా రేపు అనగా ఆగస్టు 29వ తేదీ శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మహేశ్వరం విద్యుత్ ఏఈ చక్రపాణి తెలిపారు. తుక్కుగూడ,సర్దార్



నగర్,బాసగూడ,ఫ్యూచర్ ట్రెండ్స్,ఇసారా ప్రాజెక్ట్స్,కేఎల్ఆర్ వెర్టెక్స్,రిద్వీక్ విల్లాస్,మల్లెమాల స్టూడియో,అర్కాల ప్రాజెక్ట్,చల్లా ఎలైట్,నార్త్ స్టార్,స్పీడ్ ఇన్‌ఫ్రా,గ్లోబస్ డెవలపర్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

## 'ఎవరూ నిన్ను ఇంతలా అర్థం చేసుకోలేరు' మహేశ్‌తో బంధంపై మంజుల!

అన్నాచెల్లెళ్ల బంధం చాలా ప్రత్యేకమైనదని టాలీవుడ్ హీరో మహేశ్‌బాబు సోదరి మంజుల ఘట్టమనేని అన్నారు. రక్షాబంధన్ సందర్భంగా మహేశ్‌బాబుతో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. తోబుట్టువులు మన జీవితంలోని ప్రతి దశను దగ్గర నుంచి చూసిన వ్యక్తులని పేర్కొన్నారు. తోబుట్టువులు చిన్నప్పటి నుంచి మనతో ఉంటారని మంజుల తెలిపారు. మనలోని మంచి, చెడు రెండింటినీ చూసినా మనల్ని అలాగే అంగీకరిస్తారని చెప్పారు. మనల్ని పూర్తిగా అర్థం చేసుకునే వ్యక్తుల్లో తోబుట్టువులు ముందుంటారని అన్నారు. అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల అనుబంధంలో ఎన్నో జ్ఞాపకాలు ఉంటాయని మంజుల పేర్కొన్నారు. ఎన్నేళ్లు గడిచినా ఆ ప్రేమ అలాగే కొనసాగుతుందని చెప్పారు. మహేశ్‌బాబుతో తనకున్న బంధం పట్ల ప్రత్యేకంగా కృతజ్ఞతతో ఉన్నానని తెలిపారు. తోబుట్టువులు జీవితంలో లభించే అత్యంత విలువైన కానుకల్లో ఒకరని అభివర్ణించారు. అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల బంధాన్ని ఎవరూ పూర్తిగా అర్థం చేసుకోలేరని మంజుల అన్నారు. తమ మధ్య ఎన్నో ఏళ్ల జ్ఞాపకాలు, అనుబంధం ఉన్నాయని చెప్పారు. ఈ ప్రత్యేక బంధం పట్ల ఎంతో సంతోషంగా ఉన్నానని పేర్కొన్నారు. అందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.మహేశ్‌బాబు ప్రస్తుతం ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఆగస్టు 9న మహేశ్‌బాబు పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఆయన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఇందులో ఆయన పాత్ర పేరు రుద్రగా పరిచయం చేశారు.



## నాని 'ది ప్యారడైజ్' నుంచి రెండో పాట 'యేష నాగుల' వచ్చేస్తోంది!

నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి మరో క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి రెండో సింగిల్ 'యేష నాగుల'ను విడుదల చేసేందుకు చిత్ర బృందం సిద్ధమైంది. వినూత్నంగా ఈ పాటను అమెరికాలోని డల్లాస్‌లో అనిరుధ్ రవిచందర్ కాన్సర్ట్‌లో ఈ రాత్రి (ఆగస్టు 28) ప్రత్యక్షంగా ప్రదర్శించనున్నారు. ఈ లైవ్ పెర్ఫార్మెన్స్ అనంతరం, 'యేష నాగుల' పాటను ఆగస్టు 29న అన్ని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో అధికారికంగా విడుదల చేయనున్నారు. 'నాటు మాస్' బీట్‌తో ఈ పాట ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తుందని చిత్ర యూనిట్ ప్రకటించింది. ఈ పాటకు అనిరుధ్ సంగీతం అందించగా, కాసర్ల శ్యామ్ సాహిత్యం సమకూర్చారు. జంగి రెడ్డి, సందీప్ కుమార్ తమ గాత్రంతో పాటకు ప్రాణం పోయగా, సందీప్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ఈ పాటను నాని, కీర్తి సురేశ్ పై చిత్రీకరించినట్టు తెలుస్తోంది. సుధాకర్ చెరుకూరి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో నాని సరసన హీరోయిన్ గా కయాదు లోహర్ నటిస్తుండగా, మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, ఇతర ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. పాన్-ఇండియా స్థాయిలో భారీ అంచనాలతో రూపొందుతున్న 'ది ప్యారడైజ్' చిత్రాన్ని సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.




## 'టాక్సిక్' ఫలితంపై నయనతార స్పందన






కన్నడ రాకింగ్ స్టార్ యశ్, నయనతార తదితరులు నటించిన చిత్రం 'టాక్సిక్'. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం మిశ్రమ స్పందనలు అందుకుంటోంది. ఈ సినిమాపై సోషల్ మీడియాలో రకరకాల విమర్శలు వస్తున్న నేపథ్యంలో, తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో నయనతార స్పందించారు. సినిమా ఫలితాల గురించి మాట్లాడుతూ... "పరిశ్రమలో ఉన్న అనుభవం ఒక సినిమాను ఎలా తీస్తారనే దానిపై ప్రాథమిక అవగాహన ఇస్తుంది కానీ, సినిమా అనేది ఎంతో భావోద్వేగభరితమైనది, ఊహించని మలుపులతో కూడుకున్నది. నా కెరీర్‌లో కచ్చితంగా పెద్ద హిట్ అవుతాయని కొండంత ఆశలు పెట్టుకున్న కొన్ని సినిమాలు డిజాస్టర్ అయ్యాయి. అదే సమయంలో, కొన్ని చిత్రాల ఫలితంపై నాకే సందేహాలు ఉండేవి కానీ, అవి బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో భారీ విజయాలు సాధించి ఆశ్చర్యపరిచాయి" అని తెలిపారు. ఈ ఒడిదొడుకుల నుంచి తాను నేర్చుకున్న ముఖ్యమైన పాఠం గురించి చెబుతూ... "చిత్ర పరిశ్రమలో నా ఇన్నేళ్ల ప్రయాణం ఒక విషయాన్ని నేర్పింది. సినిమా విజయమైనా, అపజయమైనా రెండింటినీ ఒకే విధంగా, వినయంతో స్వీకరించడం నేను నేర్చుకున్నాను" అని స్పష్టం చేశారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143